UNIVERSAL LIBRARY
OU_206101
UNIVERSAL LIBRARY

ఆంధ్రకవితావిమర్శన గ్రంథమాలిక. 2.

# అలంకారతత్త్వవిచారము.

గ్రంథకర్త
మపగంటి శ్రీరామయ్య

చెన్నపురి
కస్తూరిపియాన్ ముద్రాక్షరశాలలో ముద్రింపించి
ప్రచురింపబడెను.
1915

సర్వస్వామ్యసంకలితము.] [మూల్యము 0-8-0

ఆంధ్రకవితావిమర్శన గ్రంథమాలిక. 2.

# అలంకారతత్త్వవిచారము.

గ్రంథకర్త

కురుగంటి సీతారామయ్య

చెన్నపురి:

కమ్మర్షియల్ ముద్రాక్షరశాలలో ముద్రింపించి

ప్రచురింపఁబడియె.

1915

సర్వస్వామ్యసంకలితము.] [మూల్యము. 0-8-0

## సంపాదకీయభూమిక.

# ఆంధ్రకవితావిమర్శనగ్రంథమాలిక.

ఆంధ్రభాషను సర్వతోముఖముగనొనర్చిన్ గాని దాని నుండి వలసినలాభములఁ బడయఁజాలము. ఇక్కాలంబున నాంధ్రభాష వృద్ధినొందుచున్నదనుమాట వాస్తవము. ఏ ప్రక్కఁజూచినను గ్రంథమాలికలే! ఏవంకఁజూచినను భాషా సేవాసంఘములే! నవల యాంధ్రవాఙ్మయమున నీకాలమున క్రొక్రొత్తసృష్టి. ఇప్పుడు నవలలు కుప్పతిప్పలుగ వ్రాయఁ బడుచున్నవి. ఆంగ్లనవలవలె యింకఁదెనుఁగునవల సంపూర్ణ పరిణామము నొందలేదు. ఆపరిణామము కాలక్రమమున వచ్చును. ఆమార్గమున శ్రీ యాంధ్రప్రచారిణీగ్రంథమాలిక వారు చేయుప్రయత్నములకు వారాంధ్రదేశముయొక్క వంద నములకుఁ బాత్రులు. చరిత్రమనునది తెనుఁగువాఙ్మయమున క్రొక్రొత్తమాట. ఏజాతియందలి పూర్వులచరిత్రములు వ్రాయఁబడియుండునో యాజాతి యదృష్టవంతము. పూర్వుల చరిత్రలఁ జదువుటచే నాజాతివారి కభినవబలము వచ్చుచు న్నది. చరిత్రపఠన ముద్రేకజనకము. ఆంగ్లచరిత్రపఠనముననే

కదా భారతవర్షంబున నొకనూతనశక్తి యుద్భవిల్లినది ! కావున నాంధ్రులుకూడ తమపూర్వుల చరిత్రలఁజదువుట యత్యవసరము. ఈత్రోవను శ్రీవిజ్ఞానచంద్రికామండలివారొనర్చు కృషికి వారువందనీయులు. కొంతమందిమహనీయు లుదార బుద్ధితో విజ్ఞానసర్వస్వమునొకదాని సంపాదింప మొదలిడిరి. కాని యాసదుద్యమమునకుఁ దగినంతప్రోత్సాహము లేదని యనుమానము. అదినిర్విఘ్నంబుగ సాగకపోయిన తప్పక యాంధ్రుల కపకీర్తివచ్చును. భగవంతుఁడు దానికిఁదోడగుఁగాఁక ! ఆంధ్రసాహిత్యపరిషత్తొకటి స్థాపింపఁబడినది. అది యింతవఱకును చేసినపని కానఁబడదు. కాని ముందుచేయఁ గలదని నమ్మవచ్చును. ఆంధ్రదేశంబున పత్రికలు స్థాపింపఁబడినవి. వానిసంఖ్య నానాఁటికిని హెచ్చుచున్నది. ఇవియన్నియు నభివృద్ధిసూచకము లేకదా !

ఆంధ్రవాఙ్మయమునకిది నవలాయుగమని కొందఱను చున్నారు. కాని ప్రకృతియుగమునందలి వాఙ్మయములో నవల యొకయంతర్భాగముగాన ప్రకృతియుగమనియే నామకరణమొనర్చిన సమంజసముగనుండునని మా యభిప్రాయము. పురాణాంధ్రీకరణములును, ప్రబంధానుకరణంబులును, దాదాపునశించుచున్నవి. వాఙ్మయమున కొకవిధమైన స్వాతంత్ర్యమలవడుచున్నది. భాషాప్రచారము కొంచెముకొంచెముగ హెచ్చుచున్నది. నలకహైందవజాతి యొక్క సమిష్టివ్యక్తియం

దుద్భవించినస్వాతంత్ర్యేచ్ఛ దీనికంతకును మూలకారణము. భారతవర్షమంతయు నొకనూతనసో(?)దేకమునకుఁ బాలై యైక కంఠ్యముగ స్వపరిపాలనము కావలయునని కోరుచున్నది. తన్మూలమున నాంధ్రులమైనమనము మనవ్యష్టిజాతిస్వాతంత్ర్యము నకై పాటుపడుచున్నాము. రహస్యముననైన నీస్వాతంత్ర్యేచ్ఛను వెలిఁబుచ్చని యాంధ్రుఁడుండఁడనిమాయభిప్రాయము. ఆంధ్రరాష్ట్రము వచ్చిన జాతిసర్వతోముఖముగ వృద్ధినొందునని ప్రతియాంధ్రునికిని వానియంతరాత్మ చెప్పుచున్నది. జాతియందు స్వాతంత్ర్యేచ్ఛ బొడమినఁగాని వాఙ్మయమున ప్రకృతికవిత్వము బయలువెడలనేరదు. 'అభినవకవితామండలి' మొదలగువానిద్వారముల ప్రకృతికవిత్వము వెలువడుట తత్స్వాతంత్ర్యసూచకము. వానియందు ప్రచురింపఁబడుచున్నవి భావగీతములని భ్రమపడఁగూడదు. ప్రకృతికవిత్వము పూర్తిగవ్యాపించినఁగాని భావగీతము వెలువడనేరదు. వ్యాసమునన దింకనుపొడసూప లేదు. వచనశైలి సంపూర్ణపరిణామమునొందినఁగాని వ్యాసముకూడవరలనేరదు. మనయాంధ్రులకు స్వదేశమనుజ్ఞప్తి యిప్పటికివచ్చినది. మనపూర్వులచరిత్రములు వ్రాయఁబడుచున్నవి. వానినత్యాసక్తితోఁ జదువుచున్నాము. మన దేశముయొక్క పూర్వోన్నత్యము మెల్ల మెల్లఁగ బయటికివచ్చుచున్నది. నవలాకారులెక్కడనో బంగాళమునందును, ఫ్రాంసునందును, లంకాద్వీపమునందును, జరి

గినకథలఁగొనుటను కొంచెముగనాపి, యాంధ్రులచరిత్రము నుండి యితివృత్తములఁ గైకొని నవలఁ వ్రాసిన నాంధ్రోద్యమమునకు వారెంతయో తోడ్పడుదురని మాయభిప్రాయము. మెల్లమెల్లఁగ జాతివిద్యావంతమగుచున్నది. సంతోషమునొందిన లాభము లేదు. దేశౌన్నత్యంబునఁ దృప్తియుండఁగూడదు. జ్ఞానదీపమింకను దేశమునందలి మూలలనన్నిటియందును వెలుతురు నియ్యవలసియున్నది. ఆంధ్రజాతి కొక నూతనావేశము పూనినది. పూనినదానినాపక కార్యసాధనమునకై వినియోగింపవలయు. ఈ చెప్పినవన్నియుఁ బ్రకృతి యుగ సూచకములె ?

ఈ యుగముననే విమర్శనముకూడ వృద్ధినొందవలయు. విమర్శనాపూర్వకముగ, భాషాగ్రంథపఠనాసక్తిపెంపొంది, భాషాభిమానము వర్ధిల్లవలయు. భాషాభిమానము దేశాభిమానమునకు ముఖ్యాంగము. అందువలననే మనప్రముఖులు దేశభాషలలో బాలురకువిద్యను గఱపవలయునని శాసననిర్మాణసభలలోఁ బోరాడుచున్నారు. ఒకసందర్భంబున శ్రీమదనమోహనమాలవ్యాగారిట్లుచెప్పిరి.

'Literature was the best medium for improving the character of a nation, and by improving the vernacular literature you would elevate the whole nation'

ఇది ముమ్మాటికిని సత్యము. విమర్శనమువలననే యాంగ్ల వాఙ్మయము క్రిందటిశతాబ్దంబున మితిలేనివృద్ధినొందినది.అట్టి

విమర్శనము మనవాఙ్మయమున కొఱవడినది. ఒకసుప్రసిద్ధాంధ్రపండితుఁ డిట్లువ్రాయుచున్నాఁడు.

" ఇంతవఱకీభాషయందుండు కృతివిమర్శనములను పేరఁ బిలువఁబడుగ్రంథములు బండుబూతులప్రోవులు. రామాయణ భారత భాగవతాదులపై సంస్కారచికీర్షువులు వ్రాయు గ్రంథములయందు, దబ్బఱలు, నపలాపములు, మెండుగావున వానినిబుద్ధిమంతుఁడు చదువకుండుటమేలు. చదువఁబూనినచో మూలగ్రంథమునంతయుఁబఠించి సత్యాసత్యము లెఱుంగవలయు. కేవలవిమర్శనములనమ్మిన ననర్థముతప్పదు ".

ఈమాటలు సంపూర్ణసత్యములు. ఆకొఱఁతఁ దీర్చుటకై శ్రీరామలింగరెడ్డి మొదలగువారు చేతనగు విధములఁ బ్రయత్నము లొనర్చుచున్నారు. కాని యాప్రయత్నములు కూడ చాలమట్టుకు పైనుదహరించిన వాక్యములకు లక్షీభూతములగును. విమర్శ నతిస్తుతిగాని యతిదూషణముగానికానేరదు. దూషణభూషణ తిరస్కారముల కందుచోటు లేదు. ఒక సుకవి నాదర్శముగఁ దీసికొని మిగిలినయందఱిని వానితోఁ బోల్పమొదలిడినపు డాదూషణాదులకుఁ జోటుండును. కాని నిజమైనవిమర్శన మదికాదు. కేవలాంగ్లవాఙ్మయ విమర్శనానియమములు మన యాంధ్రవాఙ్మయమును విమర్శించుటలో పనికిరావు. కేవలపూర్వవిమర్శనానియమములు ప్రస్తుతకాల

మునకుఁ దగవు. కావున రెండువిధములనియమములను సమ్మేళనముచేసి సంప్రదాయములుచెడకుండ విమర్శనమును సాగింపవలయు. ఇపుడుప్రచురింపఁబడుచున్న విమర్శనములుపూర్తిగసంప్రదాయనిరసనమును చేయుచున్నవి. అట్లు చేయఁగూడదు. సంప్రదాయనిరసనము విమర్శనమును పెడత్రోవల కీడ్చుకొనిపోవును. దానిచే భాషకు హానికలుగును. కావున విమర్శనము సరియైనత్రోవల నడుపవలయు. ఆత్రోవలఁజూపుటకై యీ గ్రంథమాలిక యేర్పరుపఁబడినది ఒకవేళ నట్టి మార్గములఁ జూపలేకపోయిన పోవుదుముగాక ! కాని యా త్రోవను ప్రయత్నములొనర్చినవార మగుదుము. అదికూడ భాషాసేవయేయని నమ్ముచున్నాము. విమర్శనానియమములు చర్చవలనఁగానిస్థిరపడవు. ఆచర్చను మొదలిడుటయే మాయుద్దేశము.

ఈమాలికయందు ప్రచురింపఁబడు పుస్తకములయందలి భాషగాని, విషయముగాని నిర్దుష్టముగనుండునని మేము గట్టిగఁ జెప్పఁ జాలము. అయినను భాషను గ్రాంథికముగ వ్రాయవలయుననియే మాప్రయత్నము. విషయము చర్చింపఁబడవలయుననియే మాయాశయము. ఇందు వెలువడు పుస్తకములయందు ‘ సంఘసంస్కరణోపన్యాసములు ’ గాని, ‘ పూర్వాధునికసంఘచరిత్ర విమర్శనములు ’గాని యుండవు. సాకుపెట్టుకొని యాంధ్రకవులఁగాని, వాఙ్మయమునుగాని

తిట్టుటలుండవు. ఇదివఱకీ గ్రంథమాలికలో నొకగ్రంథము ప్రచురింపఁబడియున్నది. దాని నాంధ్రదేశము చదివియేయుండును. దానిపేరు "పింగళిసూరనార్యుఁడు" గ్రంథకర్త వింజమూరి రంగాచార్యులు, బి,ఏ,గారు. ఇందుతోఁ బ్రచురించుచున్నది రెండవది. దీనియోగ్యతను చదువరులు చదివినఁ దెలిసికొనఁగలరు. దేశాభిమానులందఱును మాయుద్యమము మంచిదనితోఁచిన మాకుఁ బ్రోత్సాహముచేయుదురని నమ్ముచున్నాము.

ఇట్లు,

సంపాదకులు.

మాతల్లియగు

శ్రీమతి

లక్ష్మీదేవికి

కు. సీ.

# తొలిపలుకు.

ప్రథమమున గురుజనులకు వందనములు. భాషాసేవారతి యీ యుద్యమమునకు ముఖ్యప్రేరకము. ముఖ్యవిషయమున కప్రస్తుతమైనను, నామిత్రులుకొందఱు చెప్పుమనుటచే, విక్రమార్కచరిత్రలఘువిమర్శనము నిందుఁ జేర్చితి. అది కొంతకాలమునకుపూర్వమాంధ్రపత్రికయందు ప్రచురింపఁబడినది. దానిఁదిరిగి ముద్రింపించుకొనుటకై సమ్మతించిన యాంధ్రపత్రికాసంపాదకులకు నావందనములు. ఉదాహరణములుగ ననువదించినపద్యముల మూలమూలలనుండి వెదుక లేదు. అందఱెఱిఁగినవానినే యనువదించితి. ఏతద్రచనయందును, ముద్రణమునందును నాకుతోడ్పడిన నామిత్రులకందఱకును నాహృదయపూర్వకవందనములు. తప్పులు మెండుగఁగలవుగాన పాఠకులు క్షమియింపవలయు.

తిరువల్లిక్కేణి,
15—10—15

గ్రంథకర్త.

# శుద్ధపత్రము.

---

కొన్నితప్పులనిట దిద్దుచున్నాను.

| పుట | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 2 | 7 | నేర్పరచినవారు | నేర్పఱచినవారు |
| డిటో | 7 | వామనుఁడు. వాభటుఁడు. | వామన వాభటులు. |
| డిటో | 14 | మరియొక | మఱియొక |
| 5 | 15 | యభిప్రాయఁపడెను. | యభిప్రాయపడెను. |
| 9 | 5 | నన్నిఁటి | నన్నిటి |
| డిటో | 13 | నిక | నిఁక |
| 10 | 7 | si | is |
| 11 | 21 | నన్నిఁటిఁ | నన్నిటిఁ |
| 14 | 10 | అందరు | అందఱు |
| 17 | 19 | మారి | మాఱి |
| 19 | 8 | తెనుఁనకుఁ | తెనుఁగునకుఁ |
| 21 | 11 | నిదివరకే | నిదివఱకే |
| 22 | 14 | ప్రాయఁపడక | ప్రాయపడక |
| 23 | 6 | బోరిఁబోరి | బోరిఁబోరిఁ |
| డిటో | 18 | మరియొక | మఱియొక |
| 26 | 15 | యెంతవరకు | యెంతవఱకు |
| 27 | 5 | న్నయ | నన్నయ |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| డిటో | 12 | మరియొక | మఱియొక |
| 27 | 20 | మరియొక | మఱియొక |
| 28 | 6 | కొంతసరకు | కొంతవఱకు |
| 30 | 7 | గలడా | గలఁడా |
| 37 | 9 | బాథను | బాధను |
| 38 | 6 | దూషణలొనర్చిన | దూషణములొనర్చిన |
| 39 | 14 | గొన్నిఁటి | గొన్నిటి |
| డిటో | 17 | నన్నిఁటి | నన్నిటి |
| 44 | 16 | యలంకారము | నలంకారము |
| 55 | 10 | యిదిపగకే | యిదివఱకే |
| డిటో | 21 | ద్వ్యలంకారము | ద్వ్యలంకారముల |
| 56 | 18 | వరించుట | వర్ణించుట |
| 58 | 18 | | వాగెను |
| డిటో | 21 | లెఱుగనివి | లెఱుఁగనివి |
| 62 | 8 | | సాకార |
| 63 | 12 | చేష్టలు | చేష్టలను |
| 68 | 15 | రస్ఫూర్తికి | రసస్ఫూర్తికి |
| 77 | 12 | పోల్చుట | పోల్చిపరీక్షించుట |
| డిటో | 20 | బావను | భావను |
| 85 | 6 | నాశవాలక | నాశకలవా |
| 87 | 4 | విక్రమార | విక్రమార్క |

# కావ్యము.

ప్రథమమున కావ్యమన నెట్టిదో దానిఁ గూర్చి మన లాక్షణికుల యభిప్రాయము లెవ్వియో తెలిసి కొనవలసియున్నది. కొన్నింటిఁ జూతము. దండ్యాచార్యుఁడు మిక్కిలి ముదుసలి లాక్షణికుఁడు. కాన నాయననే ముందుగ తీసికొందము. ఆయన కాలము నాఁటి కలంకారశాస్త్రము శైశవావస్థనుండెను. ఆయన:— —

దండ్యాచార్యుఁడు.

" ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళి "

యని కావ్యలక్షణము నానతిచ్చి యున్నాఁడు. రమణీయార్థమును దెలియఁజేయు పదముల సమూహము కావ్యమని యాయన నామకరణము నొనర్చెను. దీనివలన కావ్యమన నొక గ్రంథము కాదని స్పష్టమగుచున్నది. శబ్దజాతమనుటచే నొక వాక్యమని యిదియె యర్థము. తరువాత నట్టి వాక్యసముదాయమని లక్షణయా చెప్పవచ్చును. ఈ లక్షణమును చూచిన తోడనే యిది యలంకారశాస్త్రము పెరిగి బలిసిన కాలము నాఁటిది కాదని తెలియుచున్నది. కావ్యము రమణీయార్థమును ప్రతిపాదించినఁ జాలును.

ఆయన మరల :—

"గద్యంపద్యంచ మిశ్రంచ తత్త్రిధైవ వ్యవస్థితం"

అని దాని మూడువిధములఁ భాగించియున్నాఁడు. ఈ లక్షణమును చూచినంతనె దండ్యాచార్యుఁడు కవి కెంత స్వతంత్ర్యమిచ్చెనో తెలియఁగలదు ఈయన తర్వాతి లాక్షణికులు నియమముల నేర్పరచిరి. స్వాతంత్ర్యమును తగ్గించిరి. మొదట నియమముల నేర్పరచినవారు వామనుఁడు వాభటుఁడు.

వామనుఁడు. వామనుఁడు కావ్యము నీవిధముగ విభజించి యున్నాఁడు.

"కావ్యశబ్దోయం గుణాలంకార
సంస్కృతయో శ్శబ్దార్థయోర్వర్తతే"

దాని క్రిందమరల:—

"రీతిరాత్మా కావ్యస్య"

యని పై నియమములు చాలనట్టుల మఱియొకదానిఁ జేర్చెను. కావున దండికాలమునుండి వామనుని కాలమునాఁటి కలంకారశాస్త్ర మెంతవృద్ధినొందెనదో చూడఁగలము. ఈవృద్ధి మంచిదియో చెడ్డదియోయని యభిప్రాయభేదము లుండవచ్చును. కవికి కష్టమెక్కువయైనది. ఫలము తక్కువయైనది. కవిత్వ మెన్నఁడైన నియమములఁ బాటించి వెలువడునా ?

కవిత్వము విమర్శనము

ఇట్లు చెప్పుదునని చెప్పుపద్యము కేవలము పద్యమాత్రసారస్యము గలదిగనేయుండును. గాని నిజమైన కవిత్వమనిపించుకొనదు. అప్రయత్నముగ మనసున నిండియున్న భావము బయటికి వచ్చునపుడీ నియమములకు చోటుండదు. కవిత్వము చెప్పినట్లు లిష్టమువచ్చినప్పుడెల్ల రానేరదు. దేశకాలపాత్రములందు వెలువడుటకు తగియుండవలయు. మనము లోకసమయమున నొక భావముచే నిండి వేరొండు భావమునకు చోటుండఁగూడదు. ఆభావములు సందర్భానుసారముగ మారుచుండవలయు. ఏ భావముచే మనంబు నిండియున్నప్పుడా భావానుగుణముగఁ గవిత్వము ప్రసరించును. వీని నన్నిటిని విచారించి చూచిన కవిత్వము హృదయపూర్వకముగ నిజమైనదియును నియమము లుల్లంఘింపఁ బ్రయత్నింపదు. ఒకవేళ ప్రయత్నముగఁ గొన్ని నియమములుండిన నుండుఁగాక! కావున కవిత్వమును విమర్శించుటలో సాధ్యమైనంతవరకు కవియెడల సానుభూతి కలిగియుండవలయును. ఈనియమమును పాటించెనా? ఆ నియమమును మొదలనే వదలివేసెను అని యీ రీతిని విమర్శనాఖడ్గముఁ జేబూని యిచ్చవచ్చినట్లు లుపయోగించిన మన నియమముల ననుసరించి వ్రాయఁగల కవి ప్రపంచంబునఁ గానరాఁడు.

విశేషవిమర్శనానియమములు విమర్శన యొనర్చు పుస్తకము ననుసరించియే యుండును గాని బయటనుండవు కొన్ని

సామాన్య నియమములు బయటనుండును గాని యవి యాపుస్తకమును విమర్శించుటలో ముఖ్యములు గావు. విమర్శించుటలో కవి పుట్టినకాల మెట్టిదో, వాని శ్రోతవసరియైనదో లేనిదో, వాఁ డెట్టికష్టములు పడవలసివచ్చెనో, తత్పూర్వవాఙ్మయ మెట్లుండెనో, ఇట్టి విషయములఁ దేనికొని చర్చించి సిద్ధాంత మొసఁగవలయును కాని, ఎవనినో నొకని నాదర్శముగ నుంచికొని యుంచి వానితోఁ బోల్చి విమర్శించుట యుక్తము కాదు. కవితాశక్తి నిరంకుశము గాని విమర్శనమునకంత నిరంకుశత్వ ముండుటకు వీలు లేదు. వెనుక కవియెడల సానుభూతి కలిగి యుండవలయునని చెప్పితి. కవి సజీవుఁడైన సానుభూతి యుండక పోయినను ప్రమాద మంతగ లేదుగాని పూర్వుఁడైన సానుభూతి లేకపోయిన నావిమర్శకుఁడు గర్హ్యుఁడు.

వామన వాక్యమునకుఁ బాఠాంతరము.

పైఁ జెప్పిన వామన వాక్యమువలన కవిత్వమునకుఁ గుణములు, అలంకారములు, రీతులు, కూడ నావశ్యకములని యాయన యభిప్రాయము మల్లినాథుఁడు మాఘకావ్యము రెండవ సర్గ 86 శ్లోక వ్యాఖ్యలో :—

“ అదోషౌ సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ కావ్యం ”

అని వామనవాక్యముగ నుదహరించి యున్నాఁడు. ఈ వాక్యమే రసగంగాధరంబునఁ గూడఁ జర్చింపఁ బడియున్నది.

కావునవామనవాక్యమునకు రెండు పాఠములుకనపట్టుచున్నవి. రెండవపాఠమున రీతిపదలి వేయఁబడినది. దోషములు కొన్ని యున్నవనియు నవికూడదనియుఁ జెప్పఁబడియున్నది. ఆ దోషములెవ్వియో తర్వాతి చెప్పియున్నాఁడు. ఈ నియమము మాత్రమావశ్యకముగనె తోఁచుచున్నది. దోషములున్నఁ గావ్యముచెడదా ?

వాభటుఁడు. ఇఁక వాభటాభిప్రాయమును వివరింపవలసియున్నది.

శ్లో॥ సాధుశబ్దార్థ సందర్భంగుణాలంకార భూషితం ।
స్ఫుటరీతి రసోపేతం కావ్యం కుర్వీతకీర్తయే ॥

అని చెప్పియున్నాఁడు. ఈవాభటుఁడు వామన లక్షణమునందుకంటె నింకొక నియమమును పెంచెను. ఆ నియమమన్నిఁటికంటె ముఖ్యమని యొప్పుకొనఁదగినది. రసము లేక పోయినఁ గావ్యము పిప్పినలె నుండదా ? రసలోపమేమైన నిఁక కావ్యమెందుకు ? వెనుకటివారుకూడ రసము నుపేక్షచేసిరనియను కొనవలదు. "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" యను దండివాక్యంబున రసమునున దిమిడియున్నదని యొప్పకొనవలసినదే. వాభటుఁడుకూడ కావ్యమునకుఁ గుణాలంకారరీతు లవసరములని యభిప్రాయపడెను.

వీరి తరువాత నలంకారశాస్త్రము పారముగఁ బెరిఁగి పోయినది. ఆనందవర్ధనుఁడు క్రొత్త యంశము నొకదానిఁ గనిపెట్టెను. ధ్వనికి కావ్యములఁ బ్రాముఖ్యము నిచ్చినవారిలో నీయన ప్రథముఁడు.

ఆనందవర్ధనుఁడు, ధ్వని

ఈయన ననుసరించియే తరువాతి లాక్షణికులందఱు ధ్వని కావ్యమునకుండవలసిన ముఖ్యావయవములలో నొకటియని గట్టిగఁ జెప్పిరి. ఈయనధ్వన్యాలోక మొకయుత్కృష్టలక్షణగ్రంథము. ఈధ్వనినే యాంగ్లవాఙ్మయంబున (Suggestion) అని యందురు. ఆంగ్ల కవివర్యులగు మిల్టను, కోలెరిడ్జి (Milton and Coleridge) మొదలగు వారుకూడ నీధ్వనికి కావ్యముల నెక్కుడు స్థానము నొసఁగిరి. ధ్వనియనఁగా చెప్పినమాటలలో నున్నదానికంటె నెక్కుడర్థము స్ఫురించునట్లొనర్చుట. అట్లు స్ఫురింపఁ జేయుశక్తి చాల యద్భుతశక్తియై యున్నది. అందువలననే ధ్వనియన్న నంత యుత్కృష్ట లక్షణమని వారభిప్రాయపడుటకుఁ గారణము. ధ్వని కావ్యమునకు ఖండితముగ నుండవలసిన లక్షణమని నొక్కిచెప్పుటకు నోరాడకపోయినను అనవసరముకాదనియు, నుపయోగించిన రసపోషణమునకుఁ దోడ్పడుననియు గట్టిగఁ జెప్పవచ్చును. కావ్యగుణములలో ముఖ్యమైనదానిగ గ్రహియింపవచ్చును.

ఆనందవర్ధనుని తర్వాత భోజుఁడుకూడ లక్షణగ్రంథము వ్రాసెను. ఈయన పూర్వుల యభిప్రాయములనుండి తొలఁగినవాఁడు కాఁడు. ఈయనచెప్పిన కావ్యలక్షణముకూడ చెప్పవలసియున్నది.

భోజుఁడు.

“ శ్లో॥ నిర్దోషంగుణవత్కావ్య మలంకారై రలంకృతం।
రసాన్వితంకవిఃకుర్వన్ కీర్తింప్రీతించవిందతి॥”

దీనిఁబట్టిచూడ నీయన రసము కావ్యమునకుఁ గావలసిన ముఖ్యాంశములలో నొకటియని చెప్పియున్నాఁడు. దోషములు లేకుండుట, గుణములు కలిగియుండుట, అలంకారములతో నలంకరింపఁబడియుండుట, రసాత్మకమైయుండుట, యనునవి ముఖ్యకావ్యలక్షణములని యీయన యభిప్రాయము. రీతిని వదలివేసెను. అంతియేగాక రసమే యాత్మయని నొక్కి చెప్పెను. అట్లు నొక్కి చెప్పుటచే నిర్దోషత్వము మొదలగు లక్షణములకంటె సరసత్వము ప్రధానమని తోఁచుచున్నది. ఆత్మ లేకుండ మనుష్యుఁడెట్లు శూన్యుఁడో యట్లె రసరాహిత్యముగల కావ్యము శూన్యము. సాలంకారత్వముకూడ నీయన యభిప్రాయంబున ముఖ్యలక్షణమేయైనను సరసత్వమంతకంటె ముఖ్యతరమని గన్పట్టుచున్నది. నిజముగ రసమే యన్నిఁటికంటె యత్యవసరమని యీయనతో పాటుగ చాలమంది యభిప్రాయపడుచున్నారు. అదిగాక మిగిలిన లక్షణములు రసమున కంగములని చెప్పుచున్నారు.

ఆనందవర్ధనుని కిటీవలి లాక్షణికులలో రసగంగాధర కర్తయగు జగన్నాథునితో సరిగ మమ్మటుఁడు ముఖ్యుఁడు.

మమ్మటుఁడు.

ఈయన ధ్వనిని ప్రధానముగఁజేసి మిగిలిన విషయంబులఁబూర్వలాక్షణికుల గ్రంథములనుండి కొంచెముగఁ దొలఁగి నడచెను. ఈయన తరువాతివారందఱు సామాన్యముగ నీయన ననుసరించియే నడచిరి. అలంకారశాస్త్రంబున నీయన తర్వాత ముఖ్యమైన మార్పు లేవియుఁ జేయఁబడి యుండలేదు. ఈయన కవిత్వలక్షణమును కావ్యలక్షణమును కలిపి యీక్రిందివిధముగ చెప్పియున్నాఁడు.

"తదదోషౌ శబ్దార్థౌ అనలంకృతీ పునఃక్వాపి"

ఇందు "అనలంకృతీ పునఃక్వాపి" యనుటచే నలంకారములెల్లెడల నవసరములును, ప్రధానములును కావని స్పష్టమగుచున్నది. ఎక్కడనైన నిరలంకారముగ నుండవచ్చుననుటచే సందర్భోచితముగనని యర్థము చేసికొనవలసియున్నది. అనవసరములగు స్థలములఁగూడ ప్రయత్నముతో నలంకారముల నుపయోగింపఁగూడదని మమ్మటుని యభిప్రాయము. అవసరములగు స్థలములఁదప్పక నుపయోగింపవలయునని కూడ స్ఫురించుచున్నది. వాక్యమున్నది యున్నట్లు "ఎక్కడనైన నలంకారములు లేకపోవచ్చు" నని యర్థము. సాధ్యమైనంతవరకుండవలెనని కూడ యర్థమగుచున్నది. నిశ్చయార్థమట్లుంచి సామాన్యార్థముగ ననసరమగుచోట్ల నవశ్య ప్రయోజ్యములని

మనము తీసికొనవలయును. ఈయన కావ్యప్రకాశమునకు విశ్వనాథుఁడను మఱియొక లాక్షణికుఁడు వ్యాఖ్యానము నొకదానిని వ్రాసెను. దానిపేరు 'కావ్య ప్రకాశదర్పణము. అందు పైఁ జెప్పఁబడిన మమ్మటుని కావ్యలక్షణము చర్చించునపుడు అందలి నియమముల నన్నిఁటిఁబట్టి కావ్యమును పరీక్షచేసినచో, కవికి స్వతంత్రశక్తి తగ్గినదనియు, సంస్కృతభాషను స్వల్పసంఖ్యాకములగు కావ్యములే తన్నామమునకు నిశ్చయముగ నర్హములనియు, కవిత్వ ప్రచారవైశాల్యము తగ్గెననియు, నాయన చెప్పియున్నాఁడు. మమ్మటుని లక్షణప్రకారము పరీక్షించిననే సంస్కృతభాష నత్యుత్కృష్టములని మనమనుకొను కావ్యములు తన్నామార్హములు కానపుడు రీతి మొదలగు వానిఁగూడ నియమములుగవాడిన మన పూర్వలాక్షణికుల యభిప్రాయములచేఁ బరీక్షించిన నిక చెప్పవలసినదేమున్నది.

మమ్మటుఁడు గ్రంథాదినే కవిత్వలక్షణము నీక్రిందివిధముగ సూచించెను.

శ్లో॥ నియతి కృతనియమరహితాం హ్లాదైకమయీ మనన్య
పరతంత్రాం । నవరస రుచిరాం నిర్మితిమాదధతీ
భారతీకవేః ॥

ఈవాక్యము నీక్రిందివిధముగ నొక మహనీయుఁడు భాషాంతరీకరించి దానిభావమును వ్యక్తీకరించియున్నాఁడు.

The speech of the poet puts forth a creation which is not fettered by the laws of destiny (or necessity), whose sole essence is unmixed joy, which is not dependent on anything else, and which having nine rasas (sentiments) is charming. (Thus differing from the creation of God which is regulated by the laws of Karma, which is full of joy not unmixed with misery ignorance etc, which si governed by the laws of causation and which has only six rasas.)

నిరంకుశాః కవయః

ఈ వాక్యమునుబట్టి చూచినచో కవితాశక్తి నిరంకుశమని తోపకమానదు. "నిరంకుశాః కవయః" యనువాక్య మూరకపుట్టినదా ? బ్రహ్మసృష్టి కంటె కవిసృష్టి విలక్షణము. బ్రహ్మసృష్టి ప్రకృతి ననుసరించియే యుల్లప్పుడుండును. కవిసృష్టి యొక్కొకచోఁ బ్రకృతివిపరీతము. 'ఇది ప్రకృతివిరుద్ధము' అని చెప్పు విమర్శక వాక్యము కేవలము నిరర్థకము ప్రమాదజనితము. కవిభావ ప్రాగల్భ్యగరిష్ఠుడయి గానమునసల్పు నెడ నాకప్పుడు ప్రకృతి యుఁగకృతియు జ్ఞాపకముండదు. అట్టిప్రకృతివిలక్షణవస్తువునే యాంగ్లవాఙ్మయంబున "Supernatural element" అని యందురు. స్థూలదృష్టితోఁ జూచిన ప్రకృతి విలక్షణముగనున్నను కవిహృదయము మనము గుర్తెఱింగినచో నమ్మకవలనుపడును. కవి మనలయంతస్సుల నాకర్షించి మనలను కేవలము బానిసల నొనరించి వెంటలాగికొని పోవుచుండును. ఆంగ్లభాషయందు కవిని "Prophet" అని యందురు. దైవావేశముగలవాఁడని

యర్థము. దైవమెట్లు ప్రకృతి విపరీతుఁడో, విలక్షణుఁడో కవిగూడ నట్లే విలక్షణుఁడును, విపరీతుఁడును. కావున విమర్శకుఁడు కవిహృదయప్రవేశ మునర్చి యందలి యత్యుదాత్త భావములఁ బ్రపంచమునకుఁ దెలియఁజేయుచుండుటకు నియమింపఁబడియున్నాఁడు. ఇది మంచి, ఇది సెబ్బర, ఇది బాగుగ నుండలేదు, ఇది బాగుగనున్నది, ఇచ్చో కవి పొరపాటొనరించెను, మొదలగు స్వాభిప్రాయప్రకటనము విమర్శక కృత్యము కాదు. విమర్శకున కభిప్రాయ మొసఁగుట కధికారము లేదని యాధునికాంగ్లవిమర్శకుల యభిప్రాయమైయున్నది. మోల్టను సైంట్సుబరీ (Moulton and Saintsbury) అను వారియభిప్రాయముగలవారలే. ఈసందర్భంబున కార్లైలను (Carlyle) మహామహుఁడు విమర్శక కృత్యమునుగూర్చి చెప్పిన వాక్యము నుదహరించెద.

"Criticism must be like an interpreter between the inspired and the uninspired, between the prophet (writer) and those who hear the melody of his words" Eassy on German literature.

ఈ మమ్మటుని కావ్య కవిత్వలక్షణములు విశ్వనాథునిచే సాహిత్య దర్పణమునందును జగన్నాథునిచే రసగంగాధరంబునను పూర్తిగఁ జర్చింపఁబడినవి. విశ్వనాథుఁడు పూర్వ లాక్షణికుల యభిప్రాయములనన్నిఁటిఁ బరీక్షించి తుట్టతుదకు

కావ్యమునకును కవిత్వమునకును రసమే ముఖ్యావయవమని గట్టిగ నొక్కి చెప్పెను. అట్టిచో రసప్రధానములుగాక వస్తు ప్రధానములగు కావ్యము లేమగును ? కావ్యము లనిపించుకొనవా ? అలంకారములు వ్యంగ్యములుగాక వాచ్యములుగా నుండు కావ్యములుగూడ నాపేరునకుఁదగవా ? ఈ ప్రశ్నము లకు సమాధానముగ "రసస్ఫుర్తి" యున్నఁజాలునని చెప్పి యున్నాడు. కావునసరసత్వముకావ్యనకు ముఖ్యలక్షణమేయై నను రసము స్ఫురియించుచున్నఁగూడ కావ్యమునకులోటుండ దనియాయనయభిప్రాయము. మమ్మటుఁడుగూడ కావ్యలక్షణ మును విపులముగ వర్ణించునపు డిట్లుచెప్పి యున్నాఁడు.

"ప్రభుసమ్మితశబ్దప్రధాన వేదాది శాస్త్రేభ్యః సుహృత్సమ్మిత అర్థతాత్పర్యవ త్పురాణాదీతిహాసేభ్యశ్చ, శబ్దార్థయోర్గుణభావేన రసాంగభూత వ్యాపారప్రవణతయా విలక్షణం యత్కావ్యంలోకోత్తర వర్ణనా నిపుణకవికర్మ"

ఇందు వేదశాస్త్రపురాణేతిహాసములకంటె కావ్యమునకు వైలక్షణ్య మారోపింపఁబడినది. ఆవైలక్షణ్యమునకుఁ గారణము రసాంగభూతత్వము. కావున నాలోచించిన మమ్మటుఁడుకూడ కావ్యము రసప్రధానమని చెప్పినవారిలో నొకఁడై యున్నాఁడు. అంతియెగాక కవికి వర్ణనాశక్తి మెండుగనుండవలయుననికూడ చెప్పియున్నాఁడు. ఈమమ్మటుఁడు విశ్వనాథునివలె కావ్యము కేవలరసప్రధానమని చెప్పి నియమముల నిర

సించినవాఁడుకాఁడు. కావ్యమీయన మతమున నియమములఁ బాటించుచురసప్రధానముగ నుండవలయును.

విద్యానాథుఁడు.

జగన్నాథుని కొంచెముగ నిల్పి విద్యానాథు నెత్తుకొందము. ఈయన రచియించిన ప్రతాపరుద్రీయము దక్షిణహిందూస్థానంబున నధికారముగా పరిగణింపఁబడుచున్నది. ఈయన కేవలము పూర్వలాక్షణికుల త్రోవనే త్రొక్కెను. ఈయన కావ్యలక్షణము నీక్రిందివిధముగ వివరించియున్నాఁడు.

శ్లో॥ గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ ।
పద్యగద్యోభయమయం కావ్యం కావ్యవిదోవిదుః॥

ఈయన గుణాలంకారములు తప్పకయుండి తీరవలయునని చెప్పియున్నాఁడు. రసప్రాధాన్యమునుకూడ పూర్తిగ నుపేక్షసేయ లేదు. ఈక్రింది శ్లోకమును చూడుఁడు.

శ్లో॥ గుణాలంకారాణాం రసముపాంతికావ్యే వినిహితం।
స్ఫురచ్ఛబ్దార్థాభ్యాం తదపిహృదయానందభవతి ॥

రీతినియమమును వదలివేసెను. దోషరాహిత్యమెట్టి యవసరలక్షణమో యలంకారసాహిత్యముకూడ నంత యవసరమని యీయన యభిప్రాయము, వామనుననుసరించి యీయన త్రొక్కినత్రోవనే యీయనకూడ నడచెను. విద్యానాథుఁడుకూడ ధ్వనికావ్యమున కంగమని చెప్పెను.

శ్లో॥ శబ్దార్థమూర్తిరాఖ్యాతో జీవితం వ్యంగ్యవైభవం॥

దీనింబట్టి చూడ కవిత్వమునకును, తద్ద్వారా కావ్యమునకును వ్యంగ్యవైభవము జీవితమని ఈయన యభిప్రాయము. ఈవిషయమున నీయన యానందవర్ధను ననుసరించినట్లు గన్పట్టుచున్నది. వామనలక్షణమును ఆనందవర్ధనలక్షణమును కలిపిన విద్యానాథలక్షణమగుచున్నది.

జగన్నాథపండితుఁడు "రమణీయార్థప్రతిపాదకశబ్దః కావ్యం" అని శాసించియున్నాఁడు. ఈయనకు దండియే పరమగురువు. ఈయన కవిత్వమునకును కావ్యమునకును విచ్చలవిడి యెడమిచ్చెను. నియమములనే నిరసించెను. అందరు లాక్షణికులకంటె నీయనకు విమర్శనాశక్తి మెండు. తచ్ఛక్తి మెండుగనుండినను దక్క-నింతస్వతంత్రలక్షణము నిచ్చియుండఁడు. లక్షణగ్రంథములన్నిటిలో నీయన రసగంగాధర మతిప్రౌఢము. కేవలము రమణీయార్థప్రతిపాదకత్వమే కావ్యమునకు లక్షణమని చెప్పుట యెంతయు స్వతంత్రము. కవికి స్వాతంత్ర్యమిచ్చుటకుఁగాని, ఇయ్యకుండుటకుఁగాని విమర్శకున కధికారము లేకపోయినను, అంతస్వాతంత్ర్యము నొప్పుకొనుటకూడ పొరబాటేమోయని యనుమానింపవలసియున్నది. నియమబాహుళ్యమెంత తప్పిదమో యత్యంత స్వేచ్ఛయు నంత ప్రమాదకరము. అదియె యూతగ తప్పులతడక లిష్టము వచ్చిన చొప్పున వ్రాసిన నవియన్నియు కావ్యములుగ పరిగ

గొంపఁబడవలయునా? అప్పుడు కామశాస్త్రముకూడ నొక మహాకావ్యమని తీరవలయును. కావున నియమరాహిత్యమును నియమబాహుళ్యమును నొకేవిధముగ నపాయకరములు. మధ్యత్రోవ త్రొక్కిన బాగు. ఇప్పటికి మనము పరీక్ష చేసిన వారిలో దండియును జగన్నాథుఁడు నేకీభవింతురు. వామన వాభటు లిరువురు నేకాభిప్రాయులు. ఆనందవర్ధనుఁడు ధ్వని ప్రాధాన్యవాది. విద్యానాథుఁడు నియమములు పెంచెను. విశ్వనాథుఁడు రసప్రాధాన్యవాది. ఇఁక మిగిలినది మమ్మటుఁడు. ఆయనమాత్రము తనలక్షణమును త్రాసునతూచినటుల వ్రాసెను. ఆలక్షణమును స్వీకరింపవచ్చునని నామతము. జగన్నాథుఁడు పండితశ్రేష్ఠుఁడై చక్కబహుళముగనల్లి తనవాద బలమెంత చూపినను లక్షణమున బిగువు బహు స్వల్పముగ నున్నది. ఈ లక్షణమునుబట్టి పరీక్షించినచో కావ్యముకాని గ్రంథముండదు. ఉండదన్న స్థూలదృష్టిచే నుండదని నామతము. రమణీయతయన నెట్టిదో, రమణీయమగు నర్థమెట్టిదో, దానిని ప్రతిపాదించుచున్నదో, లేదో, ఇట్లంతరంగిక పరీక్ష లోనికింబోయిన తన్నామాత్రమైనదే యుండకపోవచ్చును. ఈచెప్పిన పనులు సామాన్యపాఠకుఁడు చేయునవికావు. అవి విమర్శకకృత్యములు. అప్పుడు విమర్శకులు బాగున్నదను పుస్తకమే బాగుండవలయును. లేదన్న పుస్తకము బాగుండఁగూడదు. కావున నిట్టి సంగతుల లోతుకు తగినంతవరకు

దిగవలయు. అంతకు మీరిపోదుమేని ముఖ్యవిషయము మఱచి యీ దగినలోతునుండి పైకి రాఁజాలము.

ఇప్పుడు మనము నమ్మునట్టు కావ్యలక్షణము నొప్పుకొంటిమి. దీనిని కొంచె మాంగ్ల కావ్య కవిత్వలక్షణములతోఁ

ఆంగ్లకవిత్వ లక్షణము.

బోల్చవలసి యున్నది ఏలన ఆంగ్లంబున నిట్లు చెప్పఁబడియున్నదని చూపిన నాధునిక పాఠకులకు విశ్వాసము మెండు. కావ్యము అనుపదమునకు మనయాలంకారికులు "కవేఃకర్మ"యని విగ్రహము నిచ్చియున్నారు. కవియొక్క కర్మ కావ్యము. అందువలననే మన కావ్యములు గద్యపద్యోభయమయములయి యున్నవి. ఆంగ్లేయభాషయందీ యర్థమునకే రెండుపదము లున్నవి, (Prose and poetry). సామాన్యముగ ఆంగ్లభాషయందు కవిత్వమనినఁగాని కావ్యమనినఁగాని Poetry అను పదము నుపయోగించుచున్నాము: మన లాక్షణికుల యభిప్రాయంబుల ప్రకారము కవిత్వమనినఁగాని కావ్యమనినఁగాని గద్యకూడ కలిసియుండవచ్చును. ఆంగ్ల విమర్శకులలో పూర్వులుPoetry అనిన పద్యరూపముననే యుండవలయునని శాసించిరి. ఆశాసనము రానురాను దుర్బలమయినది. తుదకుగద్యంబున కూడ పద్యభావంబును పద్యంబునందువలె రమణీయముగ నుపయోగింపవచ్చునని సిద్ధాంతీకరించిరి. ఇక్కాలంబున నీ క్రింద వివరింపఁబడిన కవిత్వలక్షణ మాంగ్లభాష గుర్తెఱింగిన యందఱిచే నొప్పుకొనఁబడుచున్నది:—

" Absolute poetry is the artistic expression of human mind in emotional and rythmical language. "

ఈ లక్షణంబును బట్టి చూడ rythmical language అనియే చెప్పఁబడియున్నది. గాని పద్యరూపముగనే యుండవలయునని చెప్పఁబడి యుండ లేదు. గద్యపద్యంబులకు రెంటికిని rythmical language అను విశేషణ మన్వయించును. ఈక్రింది సాక్ష్యమును చూడుఁడు.

*" If as I have been accustomed in these lectures to say that poetry is the expression in beautiful form and melodious language, of the best thoughts and nôblest emotions, which the spectacle of life awakens in the finest souls, it is clear that this may be affected by prose as truly as by verse if only the language is rythmical and beautiful.

ఇట్టియభిప్రాయమున కనేక సాక్ష్యములఁజూపవచ్చును. వానిచే నింపుట నా యుద్దేశము కాదు. వీనిఁబట్టిచూడ ' Poetry ' అను పదమును, 'కవిత్వము' అను పదమును, సమానార్థకములని యొప్పుకొనవచ్చును. ఈ యభిప్రాయ మిటీవల మారి Poetry అనిన పద్యరూపముననే యుండవలెననియు, గద్య రూపముననున్న నది తన్నామమున కర్హముకాదనియు, మొదలైన యభిప్రాయములు ప్రబలుచున్నట్లు గనపట్టు

* Professor Shairp in ' Aspects of Poetry '.

చున్నది. అవి తిరిగి సిద్ధాంతమగువరకు మనము పూర్వాభి ప్రాయప్రకారమే పోవుదము. ఆంగ్లభాషయందు కూడ కవిత్వ మునకును కావ్యమునకును నియమములున్నవి.

ఎన్ని నియమములున్నను కవి కావ్యనిర్మాణ మొనర్చిన తర్వాత నీ నియమములున్నవా? యని విమర్శకుఁడు పరీక్షించునుగాని నియమముల ననుసరించుచు కవి యెన్నటికిని వ్రాయఁడు.ఒకవేళ నెవ్వఁడైనను నియమములపట్టికను ముందునుంచికొని క్రమముగ నాసియమముల ననుసరించుచు వ్రాయ మొదలిడినను, నది కవిత్వముగనుండదు. కవిత్వ మనిపించికొనును. లేక పైత్యమనుఁడు. దేశకాలపాత్రంబుల ననుసరించి కవియగు వానికి కవిత్వము తనంత సంతోష పూర్ణహృదయంబునుండి వెలువడును. ఎప్పుడు రమ్మనిన నప్పుడు రానేరదు. ప్రపంచంబున మనము వినుచున్న యాశుధారాకవిత్వంబులో మూడంశములు ముణికినీటిధారలనుట స్పష్టము. అల్లసాని పెద్దనగా రూరకచెప్పిరా ?

చ॥ నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయినభోజన మొయ్యెలమంచ మొప్పు
తప్పరయురసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే॥

**నిజమైన కవిత్వము.** కవి దుఃఖించుచు వ్రాసిన పాఠకప్రపంచమంతయు దుఃఖింపవలసినదే. సుఖముగ వ్రాసిన నానంద మొందవలసినదే. అట్టిశక్తియీ మనముచూచుచున్న యల్లిబిల్లి పాటలకుఁ గలుగునా? లేక మారుమూలపదములను నలంకారములను బుద్ధిపూర్వకముగఁ గూర్చి వ్రాతునని వ్రాసిన కుకావ్యమునకుఁ గలుగునా? సంస్కృతభాషయందలి కావ్యాంశములన్నియు నేమియు భేదము లేకుండ తెనుఁగునకుఁగూడ వర్తించును గాన నాంధ్రలాక్షణికుల యభిప్రాయములఁ జెప్ప ననావశ్యకము.

# అలంకారములు.

ఇఁక నలంకారములఁగుఱించి చెప్పవలసియున్నది. సిద్ధాంతమని యొప్పుకొనిన మమ్మటకావ్యలక్షణమును మరల జ్ఞాపకము చేయువలసియున్నది.

"తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునఃక్వాపి"

దండి జగన్నాథులు నీయనయుఁదక్కఁదక్కుంగల లాక్షణికులందఱు నలంకారసాహిత్యమును కావ్యమున కొక ముఖ్యావయవముగా నొక్కి చెప్పియున్నారు. వారి యనుజ్ఞనే మనమనుసరించిన నలంకారములావశ్యకములాయను చర్చయే యుండదు. అవశ్యముండియే తీరవలయునని యొప్పుకొనవలసియుండును. అకారణముగ నొప్పుకొందుమా? చర్చింపవలయు. చర్చలో నావశ్యకములని తేలిన నొప్పుకొందుము. పైఁజెప్పఁబడిన ముగ్గురు లాక్షణికులుమాత్ర మలంకారములావశ్యకములని యొప్పుకొనలేదు. వారిలో వారికే భిన్నాభిప్రాయములున్నపుడు చర్చమాని యొప్పుకొనుటెట్లు? దండి జగన్నాథులు పూర్తిగ నలంకారములను వదలియే వేసిరి. మమ్మటుఁడుమాత్ర మలంకారముల నుపయోగింపవచ్చునని

స్వాతంత్ర్య మొసఁగి యున్నాఁడు. అక్కడక్కడ యన్ననవసర ములగు చోటులనని సూచించుచున్నది. లక్షణమును కొంచె ముగ విపులమొనర్చెద. " అదోషౌ " అనఁగా దోషములు లేకుండునవి. దోషములన్నఁ గావ్యదోషములు. అవి రెండు విధములు. పదగతములు వాక్యగతములును. "సగుణౌ" అనిన గుణములఁ గలిగియుండునవి. గుణములన్న శ్లేష ప్రసాదాది కావ్యగుణములు. పై జెప్పఁబడినదోషములు లేనట్టియు, గుణ ములఁగలిగినట్టియు శబ్దార్థసమూహమునకుఁ గావ్యమని పేరు. మఱియు నాశబ్దార్థములు ‚‚అనలంకృతీ పునఃక్వాపి, " అనిన నెక్కడనైన నిరలంకారములుగ నుండవచ్చును. దీనియర్థము నిదివరకే యనవసరమయిన స్థలములనవశ్య ప్రయోజ్యములని సూచించియుంటి

శబ్దాలంకార ములు.

అలంకారములు శబ్దార్థముల ననుసరించి రెండు విధము లగుచున్నవి. శబ్దాలంకారము లనియు, నర్థాలంకారములనియు. ఒక యాధుని కాంధ్రవిమర్శకుఁడిట్లు వ్రాయుచున్నాఁడు.

‚‚ శబ్దాలంకారములంత ముఖ్యములు కావని యందర ఱొప్పుకొందురు."

ఇది పూర్తిగ నిజము కాదు. అంతముఖ్యములు కాకుండుట యొక్కశబ్దాలంకార దౌర్భాగ్యమెందులకయ్యెనో తెలియరా కున్నది. అర్థాలంకారములు మాత్రమలంకారములుకావా?

ఈవిషయము ముందు చర్చింపఁబడును. ఉన్నదియున్నట్లు తీసికొన్నను ««అంత ముఖ్యములు»» నుటలో కొంత ముఖ్యములగు నని యర్థము వచ్చుట లేదా? కొంతముఖ్యము లే కాదు. కొన్ని శబ్దాలంకారములు మాత్రము కొన్నిసందర్భంబుల రసస్ఫూర్తితప్పక చేయును. అవి లేకున్న వచ్చినంతరసము రానేరదు.

ఈ క్రింది లాటానుప్రాసమును చూడుఁడు.

సీ|| కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు
జిహ్వజిహ్వ:—

లాటానుప్రాసము.

ఈపద్య మామూలాగ్రముదహరింపఁబని లేదు. ఏలన ప్రతియాంధ్రునికిని కంఠపాఠముగ రాఁదగినది. ఈ పద్యమందలి శబ్దాలంకార మెంత యర్థముకలిగి రసపోషణమున కెంత తోడ్పడెనో బుద్ధిమంతులూహించుకొనుదురుగాఁక! భక్తిరస ముట్టిపడుచున్నదని యభిప్రాయఁపడకపోరు. అందాయనుప్రాసము లేకపోయిన నంతరసమువచ్చునా? కవి యాయలంకారము నుపయోగించి పాఠకప్రపంచము నానందము నొందించి కీర్తిశేషుఁడయ్యెను. అందది యుపయోగింపకపోయిన పోతనార్యునికి సందర్భోచితముగ నలంకారముల నుపయోగించుట చేతఁగాదని నిర్ధారణచేయవచ్చును. ఇట్టిచోట్ల శబ్దాలంకారము లుపయోగించుట కూడదనుటసరియా?

ధ్వన్యను కరణము.

మఱియొక యుదాహరణమిచ్చెద. రామాభ్యుదయంబున సీతను రాముఁడు వెదకునెడ.

క॥ గిరులం దరులన్ ఝరులన్
మరులన్ గురుతరుల మరలమరలన్ వెదకున్
విరివిరి పొదలన్ రొదలన్
బొరిఁబొరిగను విను వియుక్తిఁ బొరలుందొరలున్॥

ఈ పద్యముఁ జదివినప్రతిమానవునికిని రాముఁడుబడిన కష్టములన్నియుఁ గన్నులఁ గట్టినట్లుండును. లఘు స్వరములు వరుసవెంబడి వచ్చుటతో నారసముప్పతిల్లినది. సందర్భోచితముగ ధ్వన్యనుకరణముకూడ రసోత్పత్తికిఁ గారణంబగును. రామాభ్యుదయంబున శ్లేషాద్యలంకారములు మిక్కుటముగ నుండి యసహ్యముఁగలిగించుచున్నవని యాధునికాంధ్రవిమర్శకులు కొందఱభిప్రాయఁపడినను, అందుననే రత్నములుకూడ నున్నవనిచెప్ప సాహసించుచున్నాను. అంతయు గుణమయముగ సృష్టియందుండ నేరదు. ఈయంశముకూడ నావిమర్శకులే యొప్పుకొనిరి. ఆపుస్తకమును పూర్తిగఁజదివినవారట్టి సగసూలోచనగల ప్రసంగములఁజొరఁబడరు. అద్దానినుండియే మరియొక యుదాహరణము నిచ్చెద. సీతారామలక్ష్మణులు వనవాసము పోవునెడ కొంతదూరము పోయినవెనుక సీత నడువ లేకపోయిన యవస్థను వర్ణించుసమయమున కవి ఈక్రింది పద్యమును వ్రాసియున్నాఁడు.

క॥ ఒకకొంత దవ్వుచనిచని
తెకతెకసెగలెగయునెండతెరలంబోరల
న్నకనకలజనకకన్యకు
నకటాయడుగడుగు గండమయ్యెం ద్రోవన్॥

ఈశబ్దాలంకారమును జూడుఁడు. రెండవపాదమునందలి మొదలి హ్రస్వస్వరములు, ఎండవేఁడిమిచేఁగలుగు శరీరతాపమును స్ఫురియింపఁ జేయుచున్నవి. "ఈరోజు తెకతెకలాడుచున్నది." "శరీరమునుండి సెగలుపొగలు వెడలుచున్నవి" అని మనము సామాన్య సంభాషణమందు వాడుటకూడ చదువరులెఱుఁగనిదికాదు. ఇట్లెండవేడిమిచే సీతపడు నిడుమలును తుట్టతుదకు నడుమ లేక యడుగడుగు గండమగుటయు పద్యముఁ జదివినంతనే మనంబున చిత్రితములగుచున్నవి. అట్లు మన యనుభవమునకు సరిపోవు వర్ణనమును చదువునపుడు గలుగునానందము చదువరులకు విప్పిచెప్ప నవసరము లేదు. కావుననే యలంకారములు కావ్యమున కనావశ్యకములని నొక్కిచెప్ప లేక "అనలంకృతీ పునఃక్వాపి" యని మమ్మటుఁడు వ్రాసెను. పైఁ జెప్పఁబడినచోట్ల నలంకారములయొక్క యుపయోగముచే వైశద్యము వచ్చినదో లేదో యాలోచించుటను చదువరులకే వదలివేసెద. అలంకారములయొక్క ధర్మములలో వైశద్య మొకటి. ఇప్పు డుదహరించిన శబ్దాలంకారములే గాక మరి కొన్నికూడ కావ్యమున కవసరములని యనుకొనవచ్చును.

అందుచే వాని నసందర్భములగుచోటుల నుపయోగింపవల యునని నాయాశము కాదు.

తప్పులేవెదకుట, భారతము.

ఒక్కచోట నేదో శబ్దాలంకారమునుగాని యర్థాలంకారమునుగాని యనవసరముగ నుపయోగించెనని యాకవి మీఁదను తచ్చిత్రగ్రంథముల మీఁదను నసహ్యముఁజెంది వాని నామము వినఁబడినప్పుడెల్ల వానిఁదిట్టుట సమంజసము కాదు. ఇంతకును కవి హృదయ మేరికిఁ దెలియును? మన హృదయమే మన కొకొక్కప్పుడు తెలియదు. అట్టి సందర్భంబున కవిహృదయగ్రహణంబున పొరపాటుపడుట యరుదుగాదు. కావున 'నిది' తప్పనియనుట సాహసము. అచ్చో నాయలంకార మిందులకుపయోగించెనని మనకుఁ దెలియదుగాన తప్పానర్చెనని మన మందుము. మరియు తప్పులేవెదకుట యుత్తమపురుషలక్షణము కానేరదు. ఉత్తమపురుషు లెల్లపుడును గుణగ్రహణపారీణులు. అట్టింటి రేని సర్వోత్కృష్టమనియుఁ బ్రయోగశాసన మనియు నాంధ్ర ప్రపంచమంతయు శిరసావహించిన యాంధ్రమహాభారతమందుఁగూడ లోటుల వెదకఁబూనిన గనఁబడకపోవు. అందువలన భారతము తప్పులకుప్పయనియు, పఠనార్హము కాదనియు, ననవచ్చునా? ఒకవేళనొకమూర్ఖుఁడట్లన్నను వాఁడు భాషా బహిష్కారమున కర్హుఁడు. అయినను భారతకవులవద్ద లోపములు లేవనుట నిజముగాదు. ఉన్నవి. అయిననవి గుణములలో మునిగియున్నవి.

భారతంబునఁగూడ నక్కడక్కడ కావ్యదోషములున్నవి. మాదిరికి రెంటినిఁ జూపెద. శకుంతల దుష్యంతుని వరమడుగు నవసరంబున,

చ॥ నరనుతనీప్రసాదమున నాకుదయించిన నందనున్మహా
గురుతరయౌవరాజ్యమునకుం దయతోనభిషిక్తుఁ జేయగా
వరముప్రసన్నబుద్ధి ననవద్యముగా దయచేయు నెమ్మితో
నిరుపమకీర్తి యట్లయిన నీకును నాకును సంగమంబగుఁ॥

అని చెప్పియున్నాఁడు. ఈ పద్యమునయౌచితి మాట యటుంచినను 'నరనుత' 'నిరుపమకీర్తి'యని రెండు సంబోధనములున్నవి. 'దయతోఁ' 'ప్రసన్నబుద్ధిఁ' 'అనవద్యముగాఁ' 'నెమ్మితోఁ' ఈ పదములలో నొకటితప్ప మిగిలిన వన్నియు వ్యర్థములు. ఆయొకటిగూడ వ్యర్థమేమొ! పాదపూరణార్థమె యుపయోగింపఁబడిన వనుట స్పష్టము. విమర్శకు లెట్లుసమర్థింతురో? సమర్థింతుమని శపథముపట్టిన సమర్థించుటకుమార్గంబులు లేక పోలేదు. అవి యెంతవరకు సయుక్తికములుగ నుండునో యాలోచింప వలసియున్నది. పైనుదహరింపఁబడిన పద్యము వెంబడివచ్చు కథయందే యాకాశవాణి పలుకునెడ,

చ॥ గొనకొనివీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు సే
కొని భరియింపుమీతని శకుంతల సత్యమువల్కె సాధ్వి స
ద్వినుతమహాపతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాధునకు విస్మయమందగఁ దత్సభాసదుల్ ॥

అని చెప్పియున్నాఁడు. ఇందలి 'వివేకముతోఁ' అను పదమును పై వాక్యముతో నన్వయింతురో లేక క్రిందివాక్యముతో నన్వయింతురో తెలియరాకున్నది. మొదలాపదమే వ్యర్థమని యనుమానము

సమాప్త పునరాత్తము.

పొడముచున్నది. ఈ యుదహరించినది నన్నయయందుఁగాని తిక్కనవ్రాసిన భాగమందు దోషములు లేవనుట కూడ తప్పే. వెదకిన నందఱియం దగఁపడును. నన్నయయు, తిక్కనయు నొకేవిధమయిన మానవులు. ఒకవేళ నన్నయ వ్రాసినన్ని దోషములు తిక్కనవ్రాసియుండక పోవచ్చును. ఇట్టియల్ప కావ్యదోషము లక్కడక్కడ నున్నవని భారతమును దూషించుటయు, భారతకవులఁ దూషించుటయు న్యాయమా? నన్నయతిక్కన లెట్టివారో రామభద్రుఁడును మరియొక కవికూడ నట్టివారలె. సానుభూతి లేని విమర్శనమదియొకవిమర్శనమనిపించికొనదు. విమర్శకునకుఁ గీర్తిసంపాదింపదు. విమర్శకుని తప్పొత్రోవల కీడ్చుకొనిపోవును. విమర్శన రంధ్రాన్వేషణము కాదు. కవివ్రాసిన దానియందలి భావములఁ బ్రపంచమునకుఁ దెలియఁజేయుచు విమర్శకుఁడుఁ దాను తటస్థుఁడుగ నుండవలెను. పక్షములఁ బూనవలయునని నా యాశయము కాదు. ప్రసంగవశంబున నింత చెప్పవలసి వచ్చినది.

మరియొక ప్రశ్నము రావచ్చును. సందర్భశుద్ధికిని, ఔచితీనిర్వాహమునకును, భావవైశద్యమునకును, నలంకార

ములతోడ్పడునని చెప్పుటతో వానియావశ్యకతను మీ రెట్లు నిర్ధారణసేయఁ గలిగితిరి ? అని. నిర్ధారణగ నెవరు సెప్పిరి ? వానినుపయోగింపక పోయిన నీ సందర్భశుద్ధ్యాదు లాచోటుల వచ్చియుండ వేమొ ? వాని నుపయోగించిన వచ్చెఁగదా ? కావున వానిరాకకవి ముఖ్యకారణములని యనుటయే వాని యావశ్యక కొంతవరకు నిర్ధారణచేయుట.

శ్లేషాలంకారము.

ఇట్లే శ్లేషాద్యలంకారములు కూడ సందర్భోచితములుగ రసస్ఫూర్తి యొనరించును. ఒకటి మాత్రము స్పష్టము, ధ్వన్యర్థముకూడ కథాసందర్భంబు నకుఁ దోడ్పడి సహాయకారిగా నుండి తీరవలయును. అట్లుండుట సామాన్యముగ దుర్ఘటము. ప్రకృతమునకుఁ జాల దూరముగనుండు నర్థముస్ఫురించిన నేమిప్రయోజనము? మఱి సటిపద్యముఁ జదివినవెంటనే నీధ్వన్యర్థము వ్యర్థమై ప్రయోజన కారి కాకుండుఁగదా? అట్టిధ్వనివలన ప్రయోజనమేమియును లేదు. ప్రయోజనము లేకపోవుటయేగాక యనవసరమనికూడ చెప్పవచ్చును. వైశద్యమునకుఁ దోడ్పడని గాని, రసస్ఫూర్తి యొనర్పని గాని యలంకారమువలనఁ బ్రయోజనమేమి! ధ్వన్యర్థము సామాన్యార్థమునకుఁ దోడై కథాసందర్భంబును మనంబుల నెక్కుడుస్ఫుటముగ చిత్రింపఁగలిగినచో నా శ్లేషసార్థకము. ఒక్కొకపుడు కొన్నిమాటలుగాని కొన్నిధ్వనులుగాని యొకదానివెనుక మరియొకటివంతున వచ్చుటవలన నొకవర్ణ

నాతీతమగు నానందము కలుగును. అంతియేకాదు. ఒక్కొకచో నొకే విధమగుధ్వనికాని మాటకాని వరుసగఁ గొన్నిమారు లుచ్చరింపఁబడినఁగూడ నట్టియానందమే కలుగును.

ఉద్రేకము
పోతన.

"ఉద్రేకము లేక మనోవికారము కవితాశక్తికిఁ బ్రాణాధారమైన కారణము" అని యొక యాధునికాంధ్రవిమర్శకుఁడు వ్రాసియున్నాఁడు. అది నిజము. ఉద్రేకము లేని కవియొక్క కవిత్వము చెత్తనలె రుచికరముగ నుండదు. అట్టి కవిత్వము నెన్నిమారులు చదివిననేమి? మొదలిన్నిమారులు చదువుటకు బుద్ధి పుట్టునా? మరలఁ జదువుటకు బుద్ధి యెప్పుడు పుట్టునో యప్పుడాపుస్తకము రసవంతమని యొకొంతవరకుఁ జెప్పవలసి యున్నది. ఒకవేళ నట్లు మరల నొకపుస్తకమును జదువుట యానందప్రేరితంబయిన నాపుస్తకము ప్రశస్తమయినదని యొప్పుకొనక తప్పదు. (కోలెరిడ్జి అను నొక సుప్రసిద్ధాంగ్ల విమర్శకుఁడిట్లు వ్రాసి యున్నాఁడు.

" First that not the poem which we have read, but that to which we return, with the greatest pleasure, posesses the gunuine power and claims the name of essential poetry."

ఈ నియమముచేఁ బరీక్షచేసిన మనము చదువుకావ్యములలో మూఁడువంతులు తన్నామమునకు తగవని తేలుచు

న్నది. కావున ముఖ్యముగ నట్టిశక్తి కావ్యమునకుఁ గల్గించు నవి "తన్మయత" యును "యాథార్థ్యకథనము"ను. ఈ రెంటి కిని ఉద్రేకము ప్రేరకము. కావ్యమును చెప్పకుండ నుండలే నంతపూర్ణముగ భావముతో కవియొక్క మనంబు నిండియుం డవలయు నట్టియుద్రేకముగల యాంధ్రకవులలో పోతనయ గ్రగణ్యుఁడు. ఆయన శబ్దాలంకారముల నెప్పుడైన సామా న్యముగ ననవసరములని వ్రాయెత్తియనఁగలఁడా. ఆయనకంటె నెక్కుడుగ నట్టియలంకారంబుల నుపయోగించిన యాంధ్రకవి గానరాఁడు. రామరాజభూషణుఁడుగూడ నాయనకుఁ దీసి పోవును ఒకవేళయున్నను పోతనయందున్న సందర్భశుద్ధి తది తరులఁగానరాదు. మిగిలిన వారిలోఁజూచిన ననవసరములగు స్థలములు స్వల్పసంఖ్యాకములు. పోతనలో సనవసరములగు స్థలము లల్పసంఖ్యాకములు.

పోతన శబ్దసామగ్రి యతిరమణీయమయినది. ఎంత దీర్ఘ సమాసమైనను నోటియందు తనంతఁదాఁ జారిపోవును. అనా యాసముగ నప్రయత్నముగఁ జదువవచ్చును. ఈ క్రింది సమాసముఁ జూడుఁడు.

"నభోవాహినీ, లహరీశీకరగంధవాహ పరిఖేలన్మంజరీ సౌరభ, గ్రహణేందిందిర తుందిలంబులు."

ఇట్లె పెద్దన్నగారుకూడ నచ్చటచ్చట నటిహృద్యయంగ మములగు సమాసముల నుపయోగించి యున్నాఁడు. పోతన

ప్రాతలయందంతటను నొకవిధమయిన సంగీతమిమిడియున్నది. దానిలక్షణ మెట్టిదనిన ననుభవించి తీరవలయును. ఇదమిత్థ మనిచెప్పుటకు వలనుపడదు. ఆసంగీతము తాళగతులకులోఁ బడునదిగాదు. మనము శారదాసంగీతసభ మొదలగువాని యందప్పుడప్పుడు విను కు స్తీవంటిదిగాదు. ఆసంగీతము హృదయములనాకర్షించికొని వశపఱచి కొనును. తుదకు హృదయము దానియందు తన్మయత్వమునొందును. అదిశుద్ధస్వచ్ఛందమును ఆనందదాయకమును అయియున్నది. అట్టిశక్తితెనుఁగుకవులలోఁబహుస్వల్పసంఖ్యాకులయందున్నది. ఆసంగీతమునకు పూర్ణమైన యుద్రేకమే కారణమని చెప్పవలసియున్నది. ఒక్కొకపుడు పాఠకులు పులకితులగుదురు. ప్రపంచంబును మఱతురు. కవి చెప్పునది యొకవేళ ప్రకృతి విపరీతమయినను నమ్మకతప్పదు.

పరుషసరళ స్వరములు. కొన్ని శబ్దములయందును ధ్వనులయందును సంగీతమిమిడియున్నదని చెప్పుచు నింతప్రసంగ మొనర్చితిని. సాధారణముగఁ గావ్యములలో వాడఁబడుచున్న యచ్చతెనుఁగు పదము లన్నియు నట్టివె. అనేక సంస్కృత పదములుకూడ నల్లెహృదయంగమమయిన సంగీతమునకాకరములయి యున్నవి. అట్లుండుటకుఁ గారణమాశబ్దముల సరళస్వరము లుండుట. పరుష సరళము లనఁబడు వర్ణవిభాగముచేయుట కావర్ణములయందట్టిశక్తులు,

అనగ పరుషసరళత్వము లుండుటయే ముఖ్యకారణము. సరళస్వరములకూర్పు మనములనలరింపఁజేయును. సరళభావములనట్టి సరళవర్ణములచే వర్ణింపవలయు. 'ల' 'ద' 'జ' 'బ' 'గ' మొదలగు వర్ణములు కొన్నికొన్నిసందర్భములఁ గొన్నికొన్నిశబ్దములలో నుపయోగింపఁబడిన స్థానబలముచే వానికొకవర్ణనాతీతమగుశక్తివచ్చును. ఆశక్తి మనంబుల నానందింపఁజేయును. అట్లాశక్తితో నుండుశబ్దజాతముగాని ధ్వనిజాతముగాని సందర్భోచితంబుగ శ్లేషాద్యలంకారముల యందుపయోగింపఁబడిన నట్టి యలంకారము లనావశ్యకములని యెవ్వరుఁ జెప్పఁజాలరు. పరుష సరళస్వరములఁ గ్రమముగ పరుషసరళభావ వర్ణనములయం దుపయోగింపవలయుననుట కుదాహరణములఁ గొన్నిఁటి నిచ్చెద.

మ॥ అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పలమందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకర మావినోదియగు నాపన్నప్రసన్నుండువి
హ్వలనాగేంద్రము పాహిపాహియనఁ గుయ్యాలించి
సంరంభియై ॥

ఈపద్యమంద జెటేఁగినదె. 'పురంబులోనగరిలో' యనుటచే నెంతియర్థము స్ఫురియించుచున్నది? 'లో' అనునక్షరము రెండుమారులు వచ్చుటచే వైకుంఠపురములో నింకను లోపలయని తెలియుచున్నది. పద్యముతోకూడ, మనము

వైకుంఠములోపలికి వెళ్లుచున్నట్లనుభవించుచున్నాము. 'మూల' అనుపదముచే విష్ణువు బయట లేఁడనియు లోపల నెక్కడనో మూలనున్న యంతఃపురంబున నున్నాఁడనియు చెప్పకయే స్ఫురించుచున్నది. 'మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలోత్పలపర్యంకరమావినోది' యను సమాసమును చూడుఁడు. ఇందుపయోగింపఁబడినవన్నియు సరళస్వరములు. అందువలననే సమాసమంతయు సరళమై య ప్రయత్నముగ నుచ్చారణమునకు యోగ్యమై మనంబుల నానం దింపఁ జేయుచున్నది. ఇట్టి సమాసములుగలిగి భావానుగుణ మగు రచనాశక్తిచే నిండియున్నది గావుననే గజేంద్రమోక్ష ణము చదువరుల మెప్పునువడసి పాఠశాలలయందు చిన్న తరగతుల బాలురకుఁగూడ పఠనయోగ్యముగ నియమింపఁ బడి కవికి కీర్తిని దెచ్చియున్నది. ఆధునికపఠనానియమము లచే నట్టియుత్కృష్టగ్రంథములన్నియుఁ బాలురకు పఠనీయ ములుగ నుండఁగూడదని శాసింపఁబడుటచే బాలురకు తెనుఁ గన్న నభిరుచికలుగుటకు మాఱుగ నింగ్లీషుభాషాపఠనముచే నసహ్యముపుట్టి వారు స్వభాషాదూరులగుచున్నారు. కళాశాల లలో చదువుకొను బాలురలోఁగూడ గజేంద్రమోక్షణమన్న నెందులదో, దాని రచియించిన కవియెవఁడో, దాననేమి కథ చెప్పఁబడియున్నదో, చాలమందికి తెలియదని చెప్ప వచ్చును. ప్రస్తుతమునకు వత్తును. పైనుదహరింపఁబడిన పద్య

ముననుండు భావము, వర్ణింపఁబడిన వస్తువుకూడ, నతి సరళము
లయి మృదువులయియున్నవి. కృష్ణుఁడప్పుడున్నయునికి యతి
మృదువైనదని యొప్పుకొనవలయును. పర్యంకశయనము
మృదుకర్మకాదని యెవ్వరైన ననఁగలరా? ఆపర్యంక
ముత్పలపర్యంకమఁట. ఇందుకాంతోపలములపై పరువఁబడి
నదఁట. అట్టి పర్యంకముపై కృష్ణుఁడుండెనఁట. అందురమా
వినోదికూడనఁట. ఇందు ప్రేమభావము, మృదుకర్మ, రెండును
వర్ణింపఁబడినవి. రెంటికిని సరళపదము లుపయోగింపవలసె
నదె. పోతన యెట్టి సరళపదములనేటి ప్రయోగించి సందర్భం
బునకు వన్నెఁదెచ్చెనో చూడుఁడు. కృష్ణుఁడెట్టిస్థలమునను
న్నది, ఏమిచేయుచున్నది, ఎవరితోనున్నది, ఎట్టిసమయమున
నాగజేంద్రునియార్తనాద మాయనకు వినఁబడినది, ఎట్టి
సౌఖ్యములనువదలి యాయన గజేంద్రుని రక్షించుటకు వెళ్ళి
నది, మొదలగు నంశంబులన్నియు, సంగ్రహముగను, స్ఫుట
ముగను, హృదయంగమముగను, తేనెలొలుకు పదములతో
ధ్వనులతో చెప్పి రసముట్టిపడున ట్లొనర్చెను! 'ఆపన్నప్రస
న్నుండు' అను వాక్యమందలి 'న్న' యను నక్షరముయొక్క
ద్విరావృత్తి నిశ్చయముగఁ గృష్ణుఁడు నమ్మినవారిఁ బ్రోచు
నని నొక్కి చెప్పునట్లున్నది. కృష్ణుని స్వభావ మాపన్నప్రస
న్నత్వము. ఉన్నయునికికి సరియైన స్వభావమునేటి నిర్వచించి
చెప్పెను. ఇఁక 'పాహి పాహి' యను నామ్రేడితము కేవ

లము ప్రకృతి ననుసరించియున్నది. అందుచేతనే 'పాహి పాహి' సామాన్యసంభాషణములో నుపయోగించు పదము లలో నొకటియయినది. ఏదిన్త్రైన యొకయాపద సంభవించి నపుడు 'రక్షింపుము' సి యొక్కమాఱు నోటినుండిరానేరదు. ఇంక నాతురతను భయమునననుసరించి రెండుమాఱులు అంత కంటె నెక్కుడుమాఱులుకూడ వచ్చును. 'పాము పాము' 'తేలు తేలు' 'చంపు చంపు' 'పట్టుకో పట్టుకో' మొద లగు సామాన్యసంభాషణావాక్యములు చదువరు లెఱుఁగనివి కావు. కావున నీపద్యంబునందలి పదములుగాని వర్ణములు గాని యుద్దేశము లేకుండ ప్రయోగింపఁబడినవు కావు. పోతన ఇట్లు వ్రాతును, ఈపదముల నుపయోగింతును, అనుకొనుచు వ్రాసెనా? ఉద్రేకాను సారముగ నాపదధార యట్లుసార్థకము గవచ్చినది. ఈపద్యమును చూడుఁడు.

శా॥ పాదద్వంద్వము నేలమోపిపనుఁ బంధించిపంచేంద్రియో
న్మాదంబుంబరిమార్చి బద్ధిలతకుఁ మాఱాకుహత్తించి ని
ష్ఖేదబ్రహ్మపదావలంబనగతిం గ్రీడించు యోగీంద్రుమ
ర్యాదన్నక్రముల్ విక్రమించె కరిపాదాక్రాంతినిర్వక్రమై॥

ఈపద్యంబున తుట్టతుదిపాదమందలి యనుప్రాసంబును చూడుఁడు. అర్థాలంకారముమాట యటుండనిండు. అందు 'క్ర' అను స్వరము నాలుగుమాఱులు వచ్చినది. ప్రథమమున

‘క’ యను నక్షరము పరుషము. వర్ణింపవలసినవిషయము పరుషమైనది. యోగీంద్రుఁడెట్లు మనసును కదలకుండ నాత్మధ్యానంబునఁ బ్రవేశపెట్టునో యట్లే గజేంద్రుని నక్రముకదలకుండ పట్టుకొనియున్నది. ఆపట్టును వర్ణింపవలయు. గట్టిగ నని యెంత నొక్కిచెప్పినను విషయము పూర్తిగ మనంబుల స్ఫురియింపదు. సామాన్యసంభాషణమైన నుచ్చారణలో ‘ట్టి’ అనునది యొత్తి పల్కుదుము. వ్రాతలో నట్లుచేయుటకు వీలు లేదుకదా? ఈపద్యపాదంబునందలి ‘క్ర’ యను నక్షరము అందు ముఖ్యముగ నాక్రానడి యాపద్యార్థమునకు వన్నెఁదెచ్చుచున్నది. ఎట్లు క్రానడి యక్షరమునకు మెలిక వేసికొని క్రిందిభాగముచుట్టును వ్యాపించియున్నదో యట్లే యానక్రముకూడ నాగజేంద్రుని కాలియడుగుభాగమును చుట్టుకొని మెలికవేసుకొనియున్నదని మనమనంబులకు స్ఫురించుచున్నది. ఇట్లుపయోగించు శబ్దాలంకారము లనవసరములని చెప్పుట కెవ్వరికైనను నోరుచెల్లునా? మఱియొక పద్యమును చూడుఁడు.

ఉ॥ ఊహకలంగి జీవనపుటోలమునంబడిపోరుచున్ మహా
మోహలతానిబద్ధపదముఁ విడిపించికొనంగలేక సం
దేహముఁబొందు దేహిక్రియఁ దీనదశన్ గజముండెభీషణ
గ్రాహదురంతదంత పరిఘట్టితపాదఖురాగ్ర శల్యమై॥

ఈ పద్యమునందలి కడపటి పాదమునందలి యక్షర ములు చాలవఱకు పరుషములు. ఒకవేళ మధ్యమధ్య కొన్ని సరళాక్షరములున్ననవికూడ పరుషాక్షర సామీప్యముచే పారుష్యమునుఁ బొందిపోయినవి. నక్ర మెట్లుపట్టుకొనుటచే నాగజముదీనమయిపోయెనో చెప్పవలసియున్నది. నక్రముమాత్రము తనపట్టును సడలింపక యట్లె గట్టిగఁబట్టుకొనియుండెను. గజము బాధపడుచున్నది. ఈవిషయమును కవి యెట్టిస్వరముల, శబ్దముల, నుపయోగించి వర్ణించెనో చూడుఁడు. ‘ఘట్టిత’ ‘ఖురాగ్ర’ అనుపదములు గజేంద్రుఁడు పడుబాధను చెప్పక చెప్పుచున్నవి.

విమర్శక కృత్యము.

పద్యభావంబుల నిట్లనిచెప్పుటచే కొంతమంది నవ్వవచ్చును. ఇంత యర్థమాపదంబుల నున్నదా? యనవచ్చును. మీరుచెప్పునర్థమేకాని వాస్తవముగ నా పదముల నంతయర్థము లేదన నచ్చును. నేనొకవిమర్శకుఁడను కానుగాని విమర్శనమన్నఁ గూఢముగనున్న యర్థములఁగూడఁ దెల్లంబుగ ప్రపంచంబునకుఁ దెలియఁజేయవలయునని నా యభిప్రాయము. అట్లుచేయుటచే పాఠకులకు మహాకవిగ్రంథములపై యాదరముజనించును. అదరముజనించినంతనె భాషాప్రచారము హెచ్చును. కావుననట్లుచేయుట భాషాసేవాపద్ధతులలో నొకటి. విమర్శ

కుఁడందులకై నియమింపఁబడియున్నాఁడు. కాని విమర్శనమని పేరుపెట్టి పిచ్చిపిచ్చి ప్రసంగములొనర్చి ప్రతివానిఁ దూఱుట తప్ప. నిజమైనవిమర్శనముచేతనే యింగ్లీషుభాష యింతవృద్ధికి వచ్చుటకుఁ గారణము. ఇట్లనిన లోపములకుఁ గన్నుల మూసి కొనవలయునని నాయాశయమే కాదు. లోపములన్న నిట్లున్న వని చెప్పవచ్చునుగాని దూషణలొనర్చిన నాతఁడు విమర్శకుఁ డనిపించికొనఁడు. దోషములఁ జూపుటకు దూషించుటగాక యనేక మార్గములున్నవి.

అలంకార శాస్త్రము యొక్క యావశ్యకత.

పరుషస్వరములు పరుషార్థము నిచ్చును. వర్ణింపఁబడిన విషయముగాని, భావముగాని, పరుషమని తెలియఁజేయును. పరుషార్థమును తెలియఁజేయుటకై సరళస్వరము నుపయోగించిన విపరీతరసము పుట్టును. అట్లైసరళార్థమును తెలియఁజేయుటకు సరళస్వరములనే యుపయోగింపవలయు. విషయముగాని, భావముగాని, సంకీర్ణముగ నుండినయెడఁ స్వరములుకూడ సంకీర్ణములుగ నుండవచ్చును.

ఇట్టిసంకీర్ణస్వరసమ్మేళనముకే సంస్కృతమున 'పాంచాలీరీతి' యని యందురు. అందుచేతనే మనపూర్వలాక్షణికులు వృత్తులనియు రీతులనియు కొన్నిసృష్టియొనర్చిరి. వానివలన నేసందర్భంబుల నెట్టిపదముల నుపయోగింపవలయునో తెలియఁగలదు. ఈక్రిందిపద్యమును చూడుఁడు.

తే॥ కైశికిచెలంగు శృంగార కరుణలందు,
నారభటి రౌద్రభీభత్స హారిణియగు,
నలరుభారతి హాస్యశాంతాద్భుతముల,
నమరు సాత్వతి వీరభయానకముల.

ఇట్లె ప్రతియంశమునకును నియమముల నేర్పఱచిరి. కవియయి కావ్యమును వ్రాయఁగోరువాఁడు లక్షణగ్రంథములఁ జదువుట యత్యవసరము. తత్పఠనముచే వాఁడు గొప్ప కవియె గాకపోవచ్చును. కవిత పూర్తిగ ప్రయత్నముతో వచ్చు విద్య వంటిదిగాదు. భగవత్కృపచే, పూర్వపుణ్యముచే, తత్సంస్కారముతో పుట్టవలయు. దానికి ప్రయత్నము తోడ్పడవలయును. ప్రకృతిసిద్ధముగ నట్టి వాసనగలవానికి, ఏత్రోవ మంచిదియో యేదిచెడ్డదియో తెలియఁజేయుటకై లక్షణగ్రంథములు వ్రాయఁబడినవి. తత్పఠనముచే త్రొక్కవలసిన త్రోవలఁగొన్నిఁటిఁ ద్రొక్కలేకపోయినను కూడని త్రోవల వదలి వేయవచ్చునుగదా? కావున లక్షణగ్రంథపఠనముకూడ కవియైనవానికి సహకారి కాకమానదు. కవిత్వము వెలువడునపుడా లక్షణగ్రంథములనున్న నియమములనన్నిఁటిఁ బాటింపకపోవుఁగాక! సహాయమొసఁగఁగలవనుట మాత్రము నిజము. చదువుట కోపిక లేక గ్రంథములఁ దిట్టినఁ బ్రయోజనమేమి ? అది మనబుద్ధిహీనతను తెలియఁజేయును. అందు వేయియలంకార

ములనుండ నిండు! అవియన్నియు కావ్యముల నుపయోగించి తీఱవలయుననిరా ? ఏ సందర్భంబున నేయలంకార ముపయోగించిన రసముత్పత్తిఁజెందునో విషయమున మనసిడి యాలోచించి యట్టివానినే యుపయోగించినఁ బాగు. అనవసరములగు తావుల నుపయోగింపుమని యెవరనిరి ? కవిలోపమున కాలంకారికులఁదిట్టిన నేమిప్రయోజనము ? ఆలంకారికులుబలవంతము చేసిరా? మానవబుద్ధి యాత్రోవనెంతవఱకుఁ బ్రసరింపఁగలదో యంతవఱకుఁ బ్రసరింపఁజేసి, యెంతవఱకు మానవుఁ డూహ సేయఁగలఁడో యంతవఱకూహచేసి, యెన్నివిధములగు నలంకారములు పుట్టుటకు వీలుకలదో యన్నివిధములఁజర్చించి, యలంకారశాస్త్రము నేవాఙ్మయంబునను లేనంత వృద్ధినొందించినందులకు వందనంబులిడుటకుమారుగ దూషించుట కడుంగడు గర్హ్యము. అట్టి పురోభాగిత్వము భాషాసేవానూచకముకాదు. అంతియేగాక యదితప్పని చెప్పినవానిఁ దూషింప మొదలిడుట నేమనవలయునో తెనియరాకున్నది. ఎల్లపుడు నితరాభిప్రాయసహనము భాషాసేవాతత్పరునకు ముఖ్యముగ నుండవలసిన లక్షణము. మానవ ప్రకృతికి మంచిచెడ్డలలో చెడ్డ త్వరితముగ నలవడును. మంచినిబలవంతముగఁ జొన్పవలయు. లాభమున్న లక్షణగ్రంథములు మొదలగువానిని చదువుటకు మనసొప్పదు. ఒకవేళ బలవంతముగ మొదలిడినను సదుద్దేశముతోఁ జదువుట యరుదు.

పూర్తిగఁ జదువునప్పటి కసహ్యతగూడ పూర్తియగును. కొంకోర్కకముఁ జదువమొదలిడిన పూర్తియగువఱకును, పుస్తకమునువదలుటకు మనసొప్పదు. కావున దూషణ భూషణములు చేయుటలో వెనుకముందు లాలోచించి ప్రవర్తింపవలయు. శబ్దాలంకారముల నింకను విపులముగఁ జర్చించుట యనావశ్యకము. పైన మాదిరికి నియ్యఁబడిన, శబ్దాలంకారము లుపయోగింపఁబడిన, స్థలముల నుత్పత్తియైన రసమునాలోచించిన శబ్దాలంకారముల యావశ్యకతను కొంతమట్టుకైన నొప్పుకొనకపోరు.

# అర్థాలంకారములు.

ఇఁక నర్థాలంకారములు.

శ్లో॥ హారాది వదలంకారా స్తత్రస్యు రుపమాదయః॥

అలంకారపదమన్వర్థము.

శబ్దార్థములు రెండునుఁగలసి కావ్యకన్యకు మూర్తియెట్లగునో, యెట్లు వ్యంగ్యవైభవము జీవితమగునో, యట్లె యుపమాద్యలంకారములు హారాదులగు భూషణములవలె నలంకరించును. అలంకరించునవిగాన నవి యలంకారములని పిలువఁబడినవి. ఈయర్థమే నరసభూపాలీయంబున నీక్రిందివిధముగఁ జెప్పఁబడియున్నది.

తే॥ * * *

నవియుఁ గవితాలంతాగికి హారకటక
కంకణాదులక్రియ నలంకరణకరణ
పరిణతులచే నలంకారభావ మొందు॥

స్త్రీకావ్యములకుపమానోపమేయభావము.

కావున నొకనారీమణికి భూషణములెట్లువన్నెఁ దెచ్చునో కావ్యమునకలంకారములట్లె వన్నెనే తెచ్చును. స్త్రీకి యలంకారము లావశ్యకములా? అట్లె కావ్యమునకుఁ గూడ యలంకారము లావశ్యకములనవచ్చును. నిజముగ నావశ్యకములే యైన

సొమ్ములు లేని స్త్రీల మనమెందఱఁ జూచుట లేదు?‘ సొమ్ములు’ అను పేరుగలవస్తువులన్నియు భూషణములును వన్నెఁ దెచ్చు నవి యేయైనను అన్నియు నావశ్యకములు కాకపోవచ్చును. ఇంతయను మానమేమి? అన్నియు నావశ్యకములు కావు. కొన్నిమాత్ర మనావశ్యకములుకావు, అయిన కొంతవఱ కావ శ్యకములె. భగవంతుఁ డెట్లుసృజించెనో యట్లె యాజన్మాంత ముండు స్త్రీని మనమెచ్చటనైనఁ జూచితిమా? ఎచ్చటనైన యనాగరకదేశమున నుండునేమొ! అదికూడ ననుమానమె. కావున స్త్రీకి యనావశ్యకములుకాని కొన్నియలంకారము లుగలవు. మాంగల్యమట్టివానిలో ముఖ్యమైనది. పాశ్చాత్య సువాసినులకు మాంగల్యముండదే యను కుప్రశ్నము రా వచ్చును. మన స్త్రీలకున్నరూపముననే యుండవలయునా? ప్రత్యామ్నాయముగ నంగుళీయకముండదా? పోనిండు. ఈ నగలమాట యటుండనిండు. కట్టుపుట్టంబులు సొగసును దెచ్చు ననుమాట నొప్పుకొనవలయునుగదా? అందుచే వానిని కూడ యలంకారము లనవచ్చును. ఏలన సొగసునుదెచ్చు ప్ర తివస్తువునలంకారమె. కట్టుపుట్టంబులయినను కొన్నియలంకా రములావశ్యకములని యొప్పుకొనవలయు. బోసిగనున్న నది మాత్రమలంకారమా? అలంకారము కాకపోవుటయేగాక యసహ్యకరము. నగ్నస్త్రీని చూచుట యసహ్యకరమనియెవ

రొప్పుకొనరు? వస్త్రముల నేలధరియింపవలయు? స్వాభావికసౌందర్యమని యూరకుండ రాదా? అలంకారములు బొత్తుగ నక్కఱ లేదను విమర్శకులు దానికేమియుత్తర మొసంగుదురో? అట్టి వికటస్వాభావికసుందరరూపము నేచిత్రకారుఁడైనఁ జిత్రించునా? ఒక వేళ నెవ్వఁడైన జ్ఞానహీనుఁడు గాని యనాగరకుఁడు గాని చిత్రించునేమొ?

కవిత్వము శాస్త్రమా కళయా? ఇచ్చట కవిత్వము శాస్త్రమా కళయా యను చర్చవచ్చును. శాస్త్రకళల క్రింది విధముగ లక్షణముల నిచ్చియున్నారు

శ్లో॥ యద్యత్స్యాద్వాచికం సమ్యక్కర్మ విద్యాభిసంజ్ఞికం,
కర్తుంశక్తోతి మూకోయ త్కలాసంజ్ఞంతుతత్స్మృతం॥

ఇచ్చట నీచర్చవిపులముగఁ జేయుటకు వీలు లేదు. అయినను పైలక్షణములఁబట్టి విచారించి చూచినఁ గవిత్వము శాస్త్రకళలఁ దేనియందును చేరదని చెప్పవచ్చును కవిత్వము "వాచికంకర్మ" యనిచెప్పవచ్చునా? లక్షణపఠనమెంత గట్టిగ నొనర్చినను కవిత్వము రానేరదు. ప్రకృతిసిద్ధముగ నొక శక్తి యున్నఁదక్క నెన్ని శాస్త్రములు చదివినను, కవిత్వము రానేరదు. అభ్యాసము వాచికముగ నుండనవసరము లేదు. ఆశుకవిత్వమని చెప్పుకొనుదాని విషయము మనము తలఁచి కొనఁబని లేదు. ఇఁక రెండవలక్షణమును చూతము. కళయన

మూకుఁడుగూడఁ జేయుటకు వీలుగ నుండవలెనఁట. కవిత్వమట్లుండుట కెన్నఁడును వీలులేదు. మూకుఁడు కవిత్వమును చెప్పుట నెవ్వరైనచూచిరేమొ కాని నేనెన్నఁడును చూచియుండ లేదని యొప్పుకొనవలసినదె. ఎవ్వరునుగూడ చూచియుండరని నానమ్మకము. శిల్పము చిత్రకారిత్వము మొదలగునవి యెట్లుకళలో యాయర్థంబుననె కవిత్వముకూడ నట్టికళ కాదు. మిగిలినవిషయముల వానితోపాటు నిదికూడ కళయె. 'కర్తుం శక్నోతి మూకః' అను నంశంబున మాత్రము కవిత్వము కళలనుండి తొలఁగింపఁబడవలసినదె (కళలన్నియు సౌందర్యప్రతిపాదకములును, ఆనందదాయకములును, అయియున్నవి. అట్టిచో కవిత్వముకూడ నొకకళయె. ఆంగ్లవిమర్శకులుకూడ కవిత్వమును చర్చించి కళలలోనే చేర్చిరి. కావున మనముకూడ కవిత్వమును మొత్తముమీద కళయనియే చెప్పవచ్చును.) శాస్త్రముమాత్రము కాదనికూడఁ గట్టిగఁ జెప్పఁజాలము. రెంటిలక్షణములును దానియందున్నవి. కాని మనశాస్త్రమునఁ జెప్పబడిన లక్షణప్రకారము రెంటిలో దేనియందుఁ గూడ పూర్తిగఁ జేరదు.

మిగిలినకళలకును కవిత్వమునకునుగల భేదము.

అయిన మిగిలిన కళలకును కవిత్వమునకును కొన్నిభేదములుమాత్రముకలవు. ఆభేదములను నేనుచెప్పుటకంటె మఱియొకరి పుస్తకమునుండి యనువదించెద. ఈక్రిందివాక్యములఁ జూడుఁడు.

"శిల్పిచాతుర్యముకంటెను చిత్తరువు వ్రాతనేర్పు కంటెను కవితాచిత్రత యెక్కువది. చిత్తరువువ్రాతయు, శిల్పరచనయు, నుద్దేశితాకృతి నెక్కుడు స్ఫుటముగ బాహ్యచక్షుస్సునకుఁ గోచరింపఁ జేయును. కాని యేదేనియొకసమయమున కొండొకరూప మెట్లుండునో, వేషాద్యలంకారము లెట్లున్నవో, చిత్రకారుఁడు చూపఁగల్గునుగాని, అయ్యెరూపము, అయ్యె ముఖవికాస, మెట్టిమనోవికల్పములసూచించునో, యెట్టిచేష్టావ్యాపారములఁ బొడమించునో, తెలుపుటకుఁగాని, యట్లుతెలియువారియందు తదనురూపగుణభావాది మనోవృత్తులను గలిగించుటకుఁగాని, చాలఁడు. కవియన్ననో యీరెండుపనులనుచేయును. మాతృక నెదుటనుంచుకొనకయే యాకారరూపములఁ జిత్రించును. బాహ్యపటసాహాయ్య మక్కర లేకయే చదువరుల మనశ్చక్షుస్సు లుద్దేశితరూపపటములఁ దర్శించునట్లుచేయును." చిత్రకారుఁడు నేత్రముల నానందింపఁ జేయును. గాయకుఁడు శ్రోత్రముల నానందింపఁజేయును. కవి భావేంద్రియముల రెంటినినానందింపఁజేయును. వేని నానందింపఁజేసినను పరిణామానందము మనస్సునకె. ఆనంద మెట్టిదనిన నవాచ్యమనియుత్తర మీయవలసియున్నది.

"ఆనందో బ్రహ్మ" యని శృతులు ఘోషించుచున్నవి. బ్రహ్మస్వరూప మిదమిత్థమని నిర్ధారణచేసిన నానంద

ఆనందము.

మిట్టిదని నిర్ధారణము చేయవచ్చును. అది యెట్లు? శ్రుతిశిరస్సులె "యతో వాచో నివర్తంతే" యని బ్రహ్మము వర్ణనాతీతమని చెప్పియున్నవి. బ్రహ్మము వర్ణనాతీతమగునెడ నానందముకూడ వర్ణనాతీతమనియె చెప్పవలసియున్నది. ఇఁక బ్రహ్మమును గుర్తెఱుంగుట యెట్లు? అనుభవముచేతనేయని యుత్తరమీయవలసియున్నది. బ్రహ్మం బెట్లనుభవనీయమో యానందముకూడ నట్లె యనుభవనీయము. పాశ్చాత్య విమర్శకులుకూడ యీయభిప్రాయమునె వెలిఁబుచ్చియున్నారు. అనుభవముచేత తెలిసికొనఁగలదానిని వర్ణించుటెట్లు? ఈ యానందము నొక సుప్రసిద్ధాంగ్ల విమర్శకుఁడిట్లు చెప్పియున్నాఁడు.

"This deep pleasurable sensation is so potent in its effects and yet so incomprehensible, and therefore quite incapable of being defined, that it can be fitly compared to the human soul, the principle vivifying force that energises the body and is the main spring of all human actions."

చక్కని స్త్రీచిత్రపట మెట్లానందదాయకమొ యట్లె చక్కని అనగా రమణీయమగు కావ్యమానందదాయకము. ఆ

అలంకారము లనుపయోగించుట.

చిత్రపటమునందలి స్త్రీకి భూషణములు పెట్టుట యెట్లలంకారమును తెచ్చునో యట్లె యుపమాద్యర్థాలంకారములు కావ్యమున నుపయోగించి

ననవి దానికిఁ బ్రాశస్త్యము నిచ్చును. అవి యెట్లు సందర్భోచితములుగ నుండవలయునో యివిగూడ నట్లేయుండవలయును. కాలికిపెట్టవలసిన యాభరణము చేతికిపెట్టినఁ బాగుండునా? అట్లే యుపమాలంకారము నుపయోగింపవలసిన స్థలమున నర్థాంతరన్యాసము నుపయోగించినఁ బాగుండునా? కావున నలంకారముల నుపయోగింపవలయునని మన పూర్వలాక్షణికులు చెప్పినప్పుడు సందర్భోచితముగనని మన మర్థము చేసికొనవలసియున్నదని మున్నె విన్నవించితి. శరీరమెచ్చటఁగూడఁ గనపడకుండ బంగారుతొడుగు నొకదానిఁ దొడిగికొనిన నది కూడ నసహ్యముగనే యుండదా? సహజ సౌందర్యము కనఁబడుచు మధ్యమధ్య భూషణములఁధరించిన నాభూషణములు నన్నెఁ దెచ్చును. కవిశేఖరుఁడగు కాళిదాసుఁడొకచో నిట్లు వర్ణించియున్నాఁడు.

శ్లో॥ శరకాండపాండుగండస్థలేయ మాభాతిపరిమితాభరణా।
మాధవపరిణతపత్త్రా కతిపయకుసుమేవకుందలతా॥

పరిమితాభరణయైననే సొగసు. అటులె కావ్యంబునఁ గూడ ప్రతివాక్యంబున నలంకారము నిండియున్న నది కూడ నసహ్యముగనేయుండును. స్వభావోక్తి సమగ్రముగ నుండి యచ్చటచ్చట నవసరములగు స్థలముల రత్నములట్లలంకారములు వరలుచుండవలయు. స్వభావోక్తికూడ నలంకారము కాదాయని యడుగవచ్చును. అది కొంతమట్టుకు

ముందు చర్చింపఁబడును. మన యాలంకారికులు మాత్రము స్వభావోక్తి నలంకారముగనే వాడియున్నారు.

ఉదాహరణ ఒక కవి స్త్రీరూపసౌందర్యము నొకానొక

ము,రూపకము సమయమున వరించుచు నిక్రింది విధముగ వ్రాసెను.

"జారుచెమ్మట ముత్యాలసరులచేత సహజసౌందర్య మును వెదఁజల్లుచుండె"

జారుచెమ్మట ముత్యాలసరులు సహజసౌందర్యమును వెదఁజల్లుచున్నవఁట. జారుచున్న స్వేదబిందువులకును ముత్యాలసరులకును రూపకమును చెప్పియున్నాఁడు. ముత్యాలసరుల చేత సౌందర్యమెట్లు వెదఁజల్లఁబడునో జారుచున్న చెమట బిందువులచే సహజసౌందర్యము వెదఁజల్లఁబడుచున్నది. ఈ యలంకారము నుపయోగించుటచే నెంతరసముప్పతిల్లినదో చూడుఁడు. ఇట్టిరూపక మప్రస్తుతమనికాని యనావశ్యకమని కాని యెవరనఁగలరు? అందు స్వభావోక్తిరూపకములకు రెంటి కిని క్షీరనీరములకువలె సంకరము. విచారించిన కొలఁదిని యర్థము రసమునెక్కువగ స్ఫురింపఁజేయుచున్నది. రసముతోఁ గూడ నానందము హెచ్చుచున్నది. అంతకంటె కావ్యము యొక్క ముఖ్యోద్దేశమేమున్నది? కావ్యపఠనమున కానందమే ముఖ్యపరిణామమని మనవిచేసియున్నాను.

అర్థాంతరన్యాసము.

మఱికొన్ని యుదాహరణముల నిచ్చెద.

"కామార్తా హి ప్రకృతికృపణా శ్చేతనాచేతనేషు"

"యాచ్ఞా మోఘా వరమధిగుణే నాధమే లబ్ధకామా"

"నాథుల్ నేరములేసెయం బేరలుకం జెందినయట్టి కాం
తలుచితవ్యాపారముల్ నేర్తురే ?"

"పవనపర్ణాంబుభక్షులై ననవసియినుప, కచ్ఛడాల్ గట్టు
కొనుమునిముచ్చులెల్ల, తామరసనేత్రలిండ్లబందా
లుగారె ?"

"బంధమో, చనముగుటద్భుతంబె రఘుచంద్రుని ప్రా
పొకయింతఁ గల్గినన్."

మొదలగునవి పఠించి తద్రసగ్రహణపారీణులగు వారి కర్థాంతరన్యాసముయొక్క యావశ్యతగాని, రసస్ఫురణాశక్తిగాని చర్చించి చూపుట యనావశ్యకము.

ఉపమాద్యలంకారములు కొన్ని నిత్యమెల్లెడల నుపయోగింపఁబడుచునేయున్నవి. అలంకారములనావశ్యకములని

ఉపమాద్యలంకారములు కొన్ని.

చెప్పిన యొకయాంధ్రవిమర్శకుఁడు మిగిలినవాని నుపేక్షచేసినను కాళిదాసుని సాదృశ్యకల్పనలకు మాత్రము బహుమానము నొసఁగియున్నాఁడు. సామాన్యసంభాషణముననే కొన్ని యలంకారములు స్వభావసిద్ధముగ నుపయోగింపఁబడుచుండ రసపోషణమునకయి వ్రాయఁబడు కావ్యములలో 'నుపయోగింపఁగూడదని' పిచ్చి

వాఁడుగానియనఁడు• కూడదని నొక్కి పెట్టినను రాకుండమా
ననా? రసపోషణమున కలంకారములు ముఖ్యావయవములలో
కొన్నియైయున్నవి. అదియునుఁగాక యలంకారముల నుప
యోగించుట మానవస్వభావసిద్ధమైన పనులలో నొకటియై
యున్నది. ఎవరితోనైన మాటలాడునపు డాజానుబాహుఁ
డును, అమితబలోపేతుఁడునైన యొకమనుష్యునిఁగూర్చి చెప్ప
వలసివచ్చినపుడు, "వాఁడేనుఁగువలెనున్నాఁడ"ని చెప్పమా?
ఇట్లే కొన్ని సందర్భంబులఁ దదనుగుణములగు నలంకారముల
నుపయోగించియే మాటలాడుచుందుము. కావ్యమునఁగూడ
నాప్రకారమే కవి కప్రయత్నముగ సందర్భంబునుబట్టి దొర
లును. అట్లప్రయత్నముగ నుపయోగింపఁబడునవి తప్పక
హృదయంగమములుగనుండును. అట్టివానిఁజూచిన నలంకా
రములవశ్యములనియే తోచుచుండును.

**అలంకారము రసమునుపుట్టించును.**

అలంకారమర్థమున కెంతసహాయకారియొ, సందర్భంబును
చదువరుల మనంబులనెట్లు చిత్రించునో, కథ
కెంతపటుత్వమునిచ్చునో, రసము నెంత హృద
యంగమముగ పుట్టించునో, తెలియఁజేయుట
కయి భారతమునుండి రెండుదాహరణములనిచ్చెద. కృష్ణుఁడు
మొదటిమాఱు భీష్మునిపైఁ దుముకునెడ తిక్కన సోమయాజి
యాక్రిందివిధముగ వర్ణించియున్నాఁడు:—

శా॥ అంహోమర్దనుఁడాజనార్దనుఁడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై
సింహోల్లాసవిభాసియై కవియు నుత్సేకంబునాటోపమున్
రంహస్ఫూర్తియు దీప్తమూర్తియును సంరంభంబు చూడన్ జగ
త్సంహారోన్ముఖుఁడైనరుద్రుక్రియ రౌద్రప్రక్రియం బొల్చెన్.

ఇందు "మాద్యద్భీష్మకుంభీంద్రుపై సింహోల్లాసవిభాసియై" యని చదువునప్పుడు కృష్ణభీష్ములయాకారము లసామాన్యములై, యలౌకికములై, భయజనకములై స్ఫురియించుచున్నవి. ఆకుంభీంద్ర సింహరూపకములు లేకపోయిన నను కొనిన రసము జనియింపనేరదు. భీష్ముఁడే 'కుంభీంద్రుని'వలె గొప్పవాఁడు. సింహమువలె నంతకంటె గొప్పవాఁడు కృష్ణుఁడు. అప్పుడు వారొనర్చిన యుద్ధమసామాన్యము. ప్రతిదినమును మనము బజారులఁజూచుచున్న చిల్లరపోట్లాటలవంటిది కాదు. అట్టియుద్ధ మెంతభయంకరమో మనంబుల స్ఫురియింపఁ జేయుటకై యసామాన్యకల్పన నుపయోగింపవలయు. ఈ పద్యంబునన్లే యసామాన్యకల్పన యుపయోగింపఁబడినది. ఆయుద్ధమున నెవరుగెలచెదరో యలంకారమే సూచించుచున్నది. సింహముగెలుచునా ఏనుఁగుగెలుచునా? యని యడిగిన మనమేమని సమాధానము నియ్యఁగలము? తరువాత నాల్గవపాదంబున నుపయోగించిన యలంకారమును చూడుఁడు. అది రౌద్రభీభత్సరసప్రతిపాదకము. కృష్ణునిఁ బోల్చ

వలసినపుడు సామాన్యమానవునితోఁ బోల్చిననెట్లుండును? మూషికముమీఁదికిఁ దుముకఁబోవు మార్జాలమువలెనని చెప్పవచ్చునా? లేక పిల్లిమీఁదికి లంఘింపనుంకించు కుక్కవలెనని చెప్పవచ్చునా? అట్టిచోట నట్టియలంకారమునే యుపయోగింపవలయు లేక యలంకారము లేకుండ వ్రాయవలయు. అప్పుడు ద్దేశితరసము లుద్భవిల్లునా? ఇప్పుడారసము లుత్పత్తియైనవో లేవో యాలోచించుట చదువరులకే వదలివేసెద. ఎవరికైన కోపముచే కన్ను లెఱ్ఱగనుండునపుడు "వానికన్నుల నగ్నికణములు రాలుచున్నవి" యని యను కొనమా? ఆపద్య పాదమందు రుద్రపద ముపయోగించినఁగాని రౌద్రరసము రాలేదు, రానేరదు.

మఱియొక యుదాహరణము. రసస్ఫూర్తికి మఱియొక యుదాహరణము నిచ్చెద.

ఆ॥ వె॥ మెఱపు మెఱసినట్లు మెఱయంగఁదోతెంచు
కర్ణికార కేతుకాంతి వెలుఁగ
నంపగములఁ గురునినలయించిమించి పా
ర్థజునికొడుకు మొగ్గరంబుసొచ్చె.

ఈపద్యము పద్మవ్యూహములోని కభిమన్యుఁడు పోవునపుడు తిక్కన చెప్పియున్నాఁడు. ఇందభిమన్యుగమన మెంత త్వరితమో, ఆయన శరీరకాంతి చూచువారికన్నుల నెట్లు మిఱుమిట్లు గొలుపుచున్నదో, ఆయన వ్యూహమున నెట్లుజొ

రఁబడెనో, యంతకన్నులఁగట్టి నట్లలంకారము నుపయోగింప కుండ నెవరుచెప్పఁగలరు. “మెఱపుమెఱసినట్లు” అనిన తోడనే మెఱపునందలి గుణములన్నియు నాయభిమన్యుని యందు సంక్రమించినవి. వెంటనే వానినన్నిఁటి నభిమన్యునితో సమన్వయింతుము. అంతనాయభిమన్యుని యునికి చిత్రితమై మనములఁ బ్రతిబింబించుచున్నది. ముఖ్యముగ గమనమును చెప్ప వలసివచ్చునప్పు డలంకారము లేకున్న రసోదయము కానేరదు. అందులకిప్పుడనువదించిన పద్యమే తార్కాణము. ఇట్టి స్థలముల నలంకారమనవసరమని యెవరనఁగలరు.

స్వభావోక్తి.

స్వభావోక్తివిషయమై యిదివరకే యొకప్రశ్నము వచ్చినది. అదికూడ నలంకారములలోఁ జేరవలయునాయని. నామతము తప్పకదానిఁగూడఁ జేర్పవలయుననియే. కవియని పేరుపెట్టుకొనిన ప్రతివ్రాతగాఁడును ప్రతిపద్యనిర్మాతయు స్వభావోక్తిని స్వచ్ఛముగ నుపయోగింపనేరఁడు. అందున్న యంగముల నైక్యము సులభముగ పొసఁగనేరదు. చదువుచున్నపు డొక్కొకయంగము కన్నుల కగఁపడుచుండవలయు. తుట్టతుద కన్నియుఁగలసి యొకపటమువలె మనశ్చక్షువునకునెదుటఁ గన్పడవలయు. చదువువాఁడు చిత్రకారుఁడైనచో దానిమనంబునుండితీసి చెడకుండ కాకితముపై వ్రాసిచూపింపఁగల్గునట్లుండవలయును. అతిశయోక్త్యాద్యలంకారముల నుపయోగించుటకంటె స్వభావోక్తి

నుపయోగించుట కష్టతరము. కవికి పూర్తియైన భావనాశక్తి యున్నఁగాని దాని హృదయంగమముగను, సంపూర్ణముగను, అన్యవిషయ సంకీర్ణము కాకుండునటులను, వ్రాయనేరఁడు. ప్రతియంశము నున్నదాని నున్నటుల వర్ణించిన నది స్వభావోక్తి కానేరదు. ఒకచిన్ని యుదాహరణము నిచ్చెద.

శ్లో॥ మాహిష్మతీ పురీమధ్యే
ముహూ రాఘ్రాయ మేదినీం ।
ఏకపాదం సముద్ధృత్య
శ్వా మూత్రం విసృజత్యహో ॥

దీనిని స్వభావోక్తియందురా? కానేరదని ప్రతివాఁడు ననవలసినదే. ఎందుచేతఁ గానేరదు? అదిచేసికొనిన పాపమేమి?యని యడిగిన సమాధానము లేక పోలేదు. అన్నికారణములకేమికాని యొక ముఖ్యకారణముకలదు. అందలి విషయము నీచమైనది. నీచోపమ, నీచోత్ప్రేక్ష, మొదలగునలంకారము లెట్లునింద్యములో యదికూడనట్లె నింద్యము. ఒక్క నింద్యమగుటయే కాదు. కావ్యదోషములలోఁ గూడ నొకటియైయున్నది. కావున నీవిషయమైన నున్నది యున్నట్లు వర్ణించుట స్వభావోక్తి కానేరదు. దానికికూడ విషయము తగియుండవలెను. అట్లు తగినయంశమును గ్రహించి కవి తన భావనాశక్తిచే నంగాంగీభావసామరస్యముఁ గలిగించి ప్రయోగించిన స్వభావోక్త్యలంకారముమాత్రము పోయి

యనుభవించికొనక పోదు. అట్లు కాకపోయిన నీ క్రిందిపద్య మెల్లఱకు నాహ్లాదకర మేలఁ గానలయు ?

సీ॥ ఏవిహంగముఁ గన్న నెలుఁగిచ్చుచును
    సారెకును సైకతంబులఁ గూడఁదారుఁ ।
వారి కన్గొని యడలతనజోడు గాకున్న
    మెడయెత్తి కలయంగ మింటసరయు ।
నరసి కన్నీటితో మరలి తామరతొక్కి
    వదనమెండఁగ సరోవారినద్దు ।
నద్ద్రితానఁగ సైఁప కట్టిట్టుగన్గొని
    ప్రతిబింబమీక్షించి భ్రమసియుఱుకు ।
    నుఱికి యొఱకలుదడియ నేఱొక్కతమ్మి
    కరుగు నరిగిరవంబుతోఁ దిరుగు తేంట్లఁ
    బొడుచు ముక్కున మఱియును బోవు వెదక
    సంజఁ బ్రియుఁ బాసి వగనొక్క చక్రవాకి॥

ముక్తపదగ్రస్తమను శబ్దాలంకారము నిందుపయోగించి నను దానిమాట నెత్తుకొనకయే యాధునికాంధ్రవిమర్శకులం దఱీపద్యమును మెచ్చుకొనియున్నారు. పెద్దన్నగారి స్వభావ పరిజ్ఞానమట్లుంచి మనవిమర్శకుల నిష్పాక్షికబుద్ధి కొనియాడఁ దగినది. అన్నియలంకారములనుపయోగించుటకంటె స్వభావోక్తి నుపయోగించుటకష్టము. అలంకారమునందలి యంగంబులనన్నిఁటిఁ గవి తనభావనాశక్తిచే నది దేనివెంబడించునో

స్ఫుటముగ వ్యక్తముచేయవలయు. అంగము లన్నియుఁ జేరి యొకసంపూర్ణమైన పటమేర్పడవలయు. ఆపటము పాఠకులమనంబులఁ బ్రతిబింబింపవలయు. ప్రతిబింబించి యానందమును పుట్టింపవలయు. కవి ముందు తనమనంబున ప్రతిబింబించినఁగదా యితరులమనంబులఁ బ్రతిబింబించుట కవకాశ మేర్పడఁగలఁడు కావున స్వభావోక్తిని తప్పక యలంకారములలోఁ జేర్పవలయునని నామతము.

అనావశ్యకములని చెప్పలేము.

మనలాక్షణికులందఱు సామాన్యముగ నలంకారములు కావ్యమున కవసరలను మతమువారే యనితేలినది. అలంకారములు లలితములుగను సందర్భోచితములుగ నున్నస్థలములఁ బరీక్షచేసి చూచిన నావశ్యకములనియే చెప్పవలసి వచ్చునేము? సామాన్యసంభాషణమందు, ఉపమ, రూపకము, ఉత్ప్రేక్ష, అర్థాంతరన్యాసము, గర్వోక్తి, వక్రోక్తి, మొదలగు నలంకారములను తెలియకుండ నుపయోగించుచునే యున్నాము. శబ్దాలంకారములఁ గూడ నప్పుడప్పు డుపయోగించుచునే యున్నాము.

'వాఁడు బడబడవాగను' 'వాఁడు చకచకనడచెను' మొదలగునవియును, 'వాఁడిది నిమ్మపండుఛాయ' 'వాఁడికి కండ్లు నెత్తిమీఁదికి వచ్చినవి' 'ఆగోపురమును తలనెత్తిచూచిన తలగుడ్డ క్రిందపడును' మొదలగునవియును, చదువరు లెఱు

గనివికావు. ఇఁక వ్రాసినపుస్తకములనన్నో పద్యంబులనె కాదు గద్యంబులఁగూడ నలంకారముల నుపయోగించుచు న్నారు. ఏసంస్కృతాంధ్రగద్యకావ్యమునైనఁజూచినఁ దెలిసి కొనఁగలము. తుట్టతుదకు విమర్శనాగ్రంథమైన శ్రీయుత రామలింగరెడ్డిగారి 'కవిత్వతత్త్వవిచారము'నఁగూడ పుటకు మూడు నాల్గువంతున నలంకారముల నుపయోగించియున్నా డు.ఆయన యెవ్వరెవ్వరి నెక్కడెక్కడ దూషింప సమకట్టెనో యక్కడక్కడనెల్ల యలంకారయుక్తముగ దూషించెను. అయినను ఆయన కావ్యముల నలంకారములువద్దను వాదము వాఁడే? సందర్భోచితముగ నున్నవని సమర్థించుకొనును గాఁ బోలు. కాని యలంకారముల నుపయోగించుట మానవధర్మ మని మాత్రమెన్నఁటికి ననఁడు! అలంకార ముపయోగిం పవలసిన స్థలమున నుపయోగించిన రసమును పుట్టింపఁ జేయు ననుమాట నిజము. కావ్యమునకు రసమే ప్రధానము. ఎంత యలంకారము లుపసర్జనములైనను రసమును పుట్టఁజేయునవి యన్నియు కావ్యమున కవసరము లేమైనచో నలంకారములఁ గూడ వానిలోఁ జేర్పవచ్చును. అలంకారము నుపయోగించి నఁగాని రసముపుట్టదనుమాట పూర్తిగనిజముకాదు. కొన్ని చోటులమాత్రము నిజమేమోయని యనుమానము పొడమ వచ్చును. అలంకారము నుపయోగించిన రసమువచ్చిన స్థలం బునఁగూడ నుపయోగింపకపోయిన నారసము రాదనుటకు

వలసియున్నది. దానినుపయోగింపకుండ నంతరసమును తెప్పింపఁగల మహాకవి యుండవచ్చును. అది యసంభవము కానేరదు. ఒక్కొకచో నలంకారము నుపయోగించిన రసపుష్టి రాకుండుటకుమాఱుగ రసాభాసముకావచ్చును. కవులందఱట్లలంకారముల నుపయోగింపకుండ రసమూర్తిలున ట్లొనర్చ ప్రజ్ఞకలవారుకారు. ఆంగ్లవాఙ్మయంబునఁగూడ నట్టి కవుల లెక్కించుటకు మొదలిడిన వ్రేలుమడచిచూపుట కొకరిద్దరు దక్క లేరు. పుస్తకమం దెక్కడ నొక్కచోనైన నలంకారమునుపయోగింపకుండ రసభంగము గాకుండ వ్రాయఁగల మహాకవియుండవచ్చును. అట్టివారినే కవులుగను, అట్టిగ్రంథములనే కావ్యములుగను, పరిగణించిన నిఁకఁ బ్రపంచంబున నున్న వాఙ్మయములన్నియు నేటిలో పడవేయుటకు పనికి వచ్చును. కావున నట్లుచేయుటయు పొరపాటగును. "అహో మూలచ్ఛేదీ తవపాండిత్యప్రకర్షః" అనుమల్లినాథవాక్యమట్టి విమర్శకుల కన్వయించును. ప్రపంచంబున నేసము వ్రాయుము నుకూడ నుత్తమమధ్యమాధమములని మూఁడువిధములఁ భాగింపవచ్చును. ఉత్తమజాతియతిస్వల్పసంఖ్యాకము. అధమ జాతియుపేక్షణీయము. ఇఁక మధ్యమజాతిని సామాన్యవిషయముల నధికారముగ తీసికొనవచ్చును. అట్లె కవులలోఁగూడ పైఁజెప్పినట్లు వ్రాయఁగలవా రుత్తమజాతివారు. అట్టివారుండుటయ దు. వారుపూజ్యులు.ఆదర్శముగఁదీసికొనఁ దగినవారు.

ఆదర్శముతో సామ్యమునొందుట కష్టము. అందువలననె వార ల్పసంఖ్యాకులు. అధమజాతికవులమాట నెత్తుకొనఁ బని లేదు. వారి ననుకరింపవలయునని విమర్శకులు చెప్పరాదు. చెప్పరు. మధ్యమజాతికవులనుదీసికొందము. అట్లుదీసికొనిన వారందఱు నలంకారముల నుపయోగించి రసమును పుట్టించు వారు గానున్నారు. (కవికి కావలసిన ముఖ్యాంశములలో భావనాశక్తి ప్రథమమైనది. భావనాశక్తియు నలంకారములును పరస్పరసాహాయ్యమునుకోరునంశములని కొంతవఱకొప్పుకొనవచ్చును. అలంకారములయొక్క ధర్మములు మూఁడైయున్నవి. సంగ్రహకథనము మొదటిది. చాలపదముల నుపయోగించిచెప్పినఁ గాని తెలియనియర్థమునకయలంకార ముపయోగించినఁ దెలియఁగలదు. రెండవది స్పష్టత లేక వైశద్యము. వైశద్యమున కిదివఱకే యుదాహరణములనిచ్చితి. మూఁడవది రమణీయత. రమణీయతయన నానందజనకత్వము. ఈ మూఁడును కావ్యమునకుఁగాని కవిత్వమునకుఁగాని కావలసిన ముఖ్యలక్షణము లలోఁ జేరును. వానిఁ దెచ్చు నలంకారము లనావశ్యకములని గట్టిగ నెవరు చెప్పఁగలరు ?

మఱియొకయంశము. కవిత్వమందలి ప్రతియంశమును భావములనుగాని యింద్రియములనుగాని యుల రించును. మన మలంకారములఁ దీసికొందము. భావములసాకారములు. ఇంద్రియములు సాకా

భావములు, ఇంద్రియములు.

రములు. భావముల నలరింపఁ జేయునవి సామాన్యముగ సనాకారవిషయములై యుండును. అనిన నవికూడ భావము లే యని కొంతవఱ కనుకొనవచ్చును. కవి యేదోయొక భావ మును వర్ణించునపుడు తదనురూపభావము పాఠకులమనంబుల స్ఫురింపవలయు. అట్లొనర్పఁగలవాఁడే నిజమైనకవి. కవి కూడ నాభావము ననుభవించినఁగాని యట్లొనర్ప నేరఁడు. ఒక్కొకప్పుడు సాకారవస్తువర్ణనముకూడ భావమున లరింపఁ జేయవచ్చును. మఱియొకప్పుడు సాకారవస్తువర్ణనము భావ మునకు ముఖ్యాంగమే కావచ్చును. ఒక్కయుదాహరణము నిచ్చెద. దంపతు లాలింగనముచేసుకొనుట నొకకవి యవిశ వృక్షమునకు లవలీలతి యల్లుకొనుటతోఁ బోల్చినాఁడు. అచ్చట భావమును, ఇంద్రియముకూడ, నానందము నొందుచు న్నవి. ఎట్లన్న నాలింగనము సాకారము. కన్నులకగఁపడుచు న్నది. దంపతు లాలింగనముచేసుకొనుటను చూచునలవాటు పాశ్చాత్యులలోనున్నను హైందవులలో లేకపోవుటచే చూ డకపోవచ్చును. అట్టియాలింగనమును పాఠకులమనంబుల స్ఫురియింపఁ జేయవలయు. ఒక్కొకప్పు డొకపని యలవా టున్నను దానిస్మృతి యానందముఁగలుగఁ జేయును. ఆస్మృతి యందుకూడ యంశము మనంబునఁ బ్రతిబింబించినఁగాని యాయానందము కలుగనేరదు. . లవలీలత యవిశవృక్షము నల్లుకొనుటను చూచిన నా పెనఁగికొనుటతో . యుపమేయ

మును పోల్చుకొని యట్లుండుఁగదాయని యనుకొనవచ్చును. ప్రథమమున నేత్రేంద్రియమును తన్మూలమున హృదయమును నీయలంకారముతో నలరుచున్నవి. తరువాతవచ్చునది భావము. ఇచ్చోభావమన్నఁ బ్రేమ. పాఠకులభావముల నలరింపఁజేయుటయన్న వారిమనంబులఁ దదనురూపభావమును పుట్టించుట. అట్లుపుట్టుటచే వారిమనంబు లానందించును. ఆ ప్రేమభావమునకు పాతివ్రత్యము మొదలగునవి యంగములు. మొదట ప్రేమనువిచారింతము. అవిశెవృక్షమున కల్లుకొని యున్న లవలీలతయనిన వానికిరెంటికిఁగల ప్రేమను వెల్లివిరియునట్లు తెలియఁజేయుచున్నది. అదెట్లనినఁ జెప్పుటకష్టము. భావములనాకారములని మున్నెచెప్పితి. అనాకారవస్తువును వర్ణించుటకష్టము. ఆభావముయొక్క చేష్టలు చెప్పవచ్చును. భావమెట్లుకలిగినదో యనుభవంబువలనఁ దెలిసికొనఁదగిన విషయము. నాకుఁగల్గినది. నేననుభవించుచున్నాను. సామాన్యమానవునికి ప్రతివానికిని కలుగునని నామతము. ఒకవేళ కల్గకపోయిన నేనుత్తరవాదినిగాను. నాయనుభవమును నేను చెప్పితి. నమ్మిననమ్ముఁడు. ఇతరులచిత్తవృత్తిని నేనెట్లుకనుఁగొనఁగలను? మనంబునఁగల్గినదానినే వ్రాతఁబోనిడినయెడ కొంతవఱకుఁ గనుఁగొనవచ్చును. మానవసామాన్యముగ నొకవిధమయిన వివేకమున్నదిగావునను, అట్టివివేకము నాకునుఁగలదని నమ్ముచుంటినిగావునను, నాయనుభవంబువలన నందఱు

షుఁగల్గుననిచెప్పితి. ఆకల్గినప్రేమభావమును దంపతులకు వర్తిం చుకొనిన నాయుపమాలంకారరసమును చవిఁగొలఁగలరు. అప్పుడు దంపతుల యాలింగనమునకుఁ బ్రేరకమగుప్రేమ మనంబులకు స్ఫురించును. అట్లుస్ఫురించుచు కవిచెప్పినవిష యము యథార్థమనితోచి తద్ధ్యానముననుభవించుచుండునప్పుడు కలుగునానందమునకు మేర లేదు. అంగములలో నొకటియగు పాతివ్రత్యమును విచారింతము. విటచేటులకు పరస్పరముగ నుండు ప్రేమకంటె భార్యాభర్తలకుండు ప్రేమపవిత్రమనుట కభ్యంతరము లేదు. అట్టిపవిత్రతనే పాతివ్రత్యమని వ్రాసితి. నాగవల్లిమఱియొకచెట్టునకల్లుకొనుట నెన్నఁడైనఁ జూచితివా? ఒకవేళ బలవంతముగ నల్లుకొనునట్లొనర్చినను లతయంతవిశే షముగ పెరుగనేరదు. పెరిగినను మార్దవమును సౌందర్య మును వహింపనేరదు. ఒక్క యభిశవృక్షము నల్లుకొనిననే దానికి సౌందర్యాదిగుణములు కలుగును.భగవత్సృష్టిలో స్త్రీ పురుషులకు కలయిక యెట్లుప్రకృతిసిద్ధమో యట్లె యారెంటి కిని కలయిక ప్రకృతిసిద్ధము. స్త్రీపురుషులయినను దంపతులు కాని వారికలయిక యెట్లు ప్రకృతివిపరీతమో (ఇంతకంటె మంచిమాట దొరక లేదు)యట్లెలవలీలత మఱియొకవృక్షమున కల్లుకొనుట ప్రకృతివిపరీతము. దంపతులుకానివారు కలి యుట మనముచూచుచున్నాము. పూగలత మఱియొకవృక్ష మున కల్లుకొనవచ్చును. వానిని మన ముపేక్షచేయవచ్చును

లవలీలతకేఁ బోల్పవలసిన యవసరమేమి ? ప్రపంచంబున నిఁకలతలు లేవా ? ఇట్లు ప్రశ్నించిన సమాధానము చెప్పవచ్చును. ప్రపంచంబున నసంఖ్యాకములగు లతలుగలవు. వానిలో మూఁడువంతులు వృక్షవివక్ష లేకుండ ప్రతివృక్షమున కల్లుకొనును. లవలీలత యట్లుకానేరదు. అవిశవృక్షము నకే యల్లుకొనివరలును. ఇట్లుతీసిన నెన్నియోసూక్ష్మాంగము లీయలంకారమునఁ గనఁబడును. జెత్ప్రయత్నమంతయుఁ జదువరులకే వదలివేసెద. ఇట్లలంకారములలోనియంగములఁ బరీక్షచేసిన మంచిచెడ్డలు తెలును ఆవశ్యకమైనదియు కానిదియు తెలిసికొనఁగలము. విభజించి దానియందలి సూక్ష్మములఁ గ్రహించి యానందమునొందుట ప్రతివాఁడును చేయఁదగినపనికాదు. అట్లొనర్చుట బుద్ధివికాసము ననుసరించియుండును. చెప్పవచ్చినమాట మఱచితిని. కావున భావముల నలరింపఁజేయు నలంకారములు సాకారవస్తువులనుండి గ్రహించినవి గావచ్చును. అయినను ప్రమాదము లేదు. సాకారవస్తువులన్న బాహ్యప్రపంచంబునుండి గ్రహియింపఁబడినవని యర్థము. బాహ్యప్రపంచమన్న మనము ప్రతిదినము చూచుచు మనము నివసించియుండునదియని యభిప్రాయము. కన్నుల కగఁపడువస్తువులన్నియు సాకారము లేకదా. సాకారవస్తువులన్నియు పరిణామవంతములు. ఒకొక్కకప్పుడాపరిణామముల నలంకారముల నుపయోగింప

వచ్చును. అప్పుడుకూడనాపరిణామములను మనము ప్రత్యక్షముగఁ జూడకున్నను వానినిపకారవస్తువులుగనే పరిగణింపవలయును.

ఇంద్రియములు.

కేవలేంద్రియముల నలరఁజేయు నలంకారములవిషయమైకూడ కొంచముగఁ జెప్పవలయును. ఇంద్రియములనినప్పుడు కర్మజ్ఞానేంద్రియముల రెండు తరగతులఁ గ్రహింపవచ్చును. జ్ఞానేంద్రియములఁ గొన్నిటిఁగూర్చిచెప్పెద. కవి నాయకుఁడనుభవించు ప్రియాకరస్పర్శనమును వర్ణించుచున్నాఁడనుకొందము. ఆ విషయమువలన నానందమొందునది త్వగింద్రియము. అందువలన తదనురూపస్పర్శనము నొకదాని నుపమానముగా చెప్పినట్లైన దానియందలిగుణములు దీనియందుఁగూడఁగలవని పాఠకులు సమన్వయించుకొందురు. అట్లుసమన్వయించుకొనుటచే నాస్పర్శనము ననుభవింపగలరు. అట్లుపోల్చినఁదప్ప యాస్పర్శనమెట్లున్నదో తెలిసికొనఁజాలరు. ఒకవేళ పాఠకులట్టిస్పర్శసుఖము నిదివఱకే ప్రత్యక్షముగ ననుభవించినవారేయైనను అట్లుపోల్చిచూపినఁదక్క తదనుభవస్మృతి వారి మనంబులకు రానేరదు. ఆస్మృతినచ్చినఁదప్ప వారానందింపఁజాలరు. కావున నేవిధమునచూచినను పోల్చిచూపుటమాత్రమవసరము. చక్షురింద్రియమునుగూర్చి యిచ్చటచెప్పఁబనిలేదు. వెనుకనిచ్చిన లవలీలతోదాహరణమును జ్ఞప్తికిఁ

దెచ్చుకొనినఁజాలును. మఱియు నొకవస్తువును వర్ణించున
పుడు, ఆవస్తువు పాఠకులుచూడనిదయిన, వారుచూచి
నట్లియు, వర్ణింపవలసినవస్తువునకువలె సమానధర్మములున్న
ట్టియు, మఱియొకవస్తువు నుపమానముగఁ జెప్పిన గాని యా
వస్తువెట్టిదో పాఠకులు తెలిసికొనఁజాలరు. అట్లే శ్రోత్రేంద్రి
యమునకుఁగూడ చెప్పవచ్చును. అట్లే యన్ని యింద్రియము
లనలరింపఁ జేయు నుపమానములు బాహ్యప్రపంచమునుండి
గ్రహియించినవగును. అట్లుగ్రహించి సందర్భమునందలివస్తు
వును మనంబుల స్ఫురియింపఁ జేసినఁగాని యానందముకలుగ
నేరదు. ఇంద్రియములలరినను, భావములలరినను, పరిణా
మానందము మనస్సునకే గాన మనస్సునకీ యింద్రియములును,
భావములును ద్వారములు. ఆనందోత్పత్తి కాకపోయిన కావ్యో
ద్దేశము నష్టమైనది. అటులనె మానవులొనరించు పనులఁ
గొన్నింటిఁ జెప్పునప్పు డలంకార మవశ్యప్రయోజ్యమని తోఁ
చును. మఱియు పరిమాణమును చెప్పవలసివచ్చినపుడు కూడ
నలంకార ముపయోగించినఁగాని యాకారస్ఫూర్తి కలుగనే
రదు. వెనుకయిచ్చిన యలంకారమే యిచ్చటఁగూడ సమన్వ
యించును. పెద్దయాకారముగలవానిఁ జెప్పవలసివచ్చినపుడు,
ఎన్నిమారులు 'పెద్దపెద్ద' అనిచెప్పినను పెద్దతనము తెలియుట
కష్టము. ఒక్కమారు 'వాఁడేనుఁగువలె నున్నాఁడ'ని చెప్పిన
నొక్కమాట యెంతపనిచేసినదో చూడఁగలము. అదేప్రకార

ముగ ముఖము కమలమువలెనున్నది మొదలగు నుపమాలంకారములుకూడ ననవసరములని తోచుటకు వీలు లేదు. అందు ఉపయోగించునవియె గాన కొన్ని నీరసములుగ తోచవచ్చును. నిజమైన విమర్శకుని కట్లుతోచుట మంచిది కాదు. ప్రతిదినముతినుచున్నామని యన్నముపై నసహ్యము పుట్టునా? అట్లసహ్యము పుట్టిన నదిరోగసూచకము. విచారించి చూచిన నింద్రియములానంద మొందునప్పు డలంకారములనుపయోగించుట యనవసరమని తోచును అప్పు డలంకారములయందు పమానములు బాహ్యప్రపంచంబునుండి గ్రహించినవగును. గత్యాదులఁ జెప్పునపుడుకూడ నలంకారములనుపయోగించినఁగాని పూర్తియైనభావన కలుగనేరదు. శబ్దము కాకుండ నడచునపుడు 'వాఁడు పిల్లివలె నడచుచున్నాఁడ' ననమా? అక్కడ రసస్ఫూర్తియగుట లేదా? అందుచేతనే మనలాక్ష ణికు లలంకారము లుండవలెనని చెప్పిరి. వారుకూడ నున్న రసస్ఫూర్తికిఁ దోడ్పడునని చెప్పిరి గాని లేకున్న కావ్యత్వహాని యున్నదియని చెప్పియుండ లేదు.

ప్రసంగవశంబున మఱియొకయంశము చెప్పవలసియున్నది. ఆంధ్రభాష దినదినము వృద్ధినొందుచున్నదనుట నిర్వివాదాంశము. ఆంగ్లభాషావాఙ్మయచరిత్రను చూచిన తద్వాఙ్మయము పత్రికాముఖమున చాలవృద్ధినొందినదనుటను మనము తెలిసికొనఁ

పత్రికా కవిత్వము.

గలము. అట్లె తెనుఁగుభాషకూడ పత్రికాముఖమున వృద్ధి నొందుచున్నది. ఏతెనుఁగుపత్రికనైనఁజూడుఁడు. ఒకవిమర్శనమో, యొకగీతమో, మఱియేదియో చూచుచునేయున్నాము. మిగిలినవానిమాట మనకక్కఱ లేదుగాని గీతములను గూర్చి కొంచెముగఁజెప్పవలయు. పదావళికే కావ్యమని నామకరణమొనర్పనగునుగాన నీ గీతములనుకూడ కావ్యములని పిలువవచ్చును. వానిని లఘుకావ్యములందము. ఇప్పుడు పత్రికాముఖమునఁ బ్రచురింపఁబడుచున్న లఘుకావ్యముల నన్నివిషయములును కావ్యవిషయములుగా పరిగణింపఁబడుచున్నవి. ప్రతివిషయమును కావ్యమునకుఁదగునా? ఆప్రశ్నమునకు విపులచర్చవలనిగాని సమాధానమునిచ్చుటకు వీలు లేదు. చాలమందివిమర్శకుల యభిప్రాయముఁబట్టి ప్రతివిషయమును కావ్యమునకుఁదగదని తెలును. పద్యవిషయములసామాన్యములుగ నెక్కడనోయుండునని యనుకొనవలదు. ఈ క్రిందివాక్యమును చూడుఁడు.

"The matter and diction of this French poetry seemed to be characterised, not so much by poetic thoughts, as by thoughts, translated into the language of poetry.'

ఈవాక్యము పద్యవిషయములఁజర్చించునపుడు కోలెరిడ్జిచేఁ వ్రాయఁబడినది. ఇందుఁజెప్పినట్లు వాడఁబడువిషయములలోఁ గొన్నిపద్యవిషయములు. కొన్ని పద్యములనుపయోగింపఁబడిన సామాన్యవిషయములు. ఇప్పుడు మనముచూచు

చున్న లఘుకావ్యములఁ వాడఁబడువిషయములు చాలమట్టు కీ రెండవజాతికిఁ జేరియున్నవి. ప్రతివిషయమునుఁ గూర్చియు పద్యములు వ్రాయవచ్చునే కాని యాకవిత్వము పవిత్ర మగుకవిత్వములో నొకభాగముకాదని నానమ్మకము. ఒకవేళ భాగమేయైన నదియధమకవిత్వమని చెప్పవలసినదే. లఘుకావ్యము తెనుఁగున బొత్తుగ శూన్యము కాకపోయినను, ఆంధ్రదేశంబున పత్రికాస్థాపనము దానినితిరిగి పెంచినదనుటకు సందియంబు లేదు. ఆంగ్లవాఙ్మయంబున నిట్టిలఘుకావ్యప్రచారము మెండు. దానిననుకరించియే మనవారుకూడ నిట్టిప్రయత్నములకుఁ గడఁగిరి. కావ్యనిర్మాతల కిట్టివిషయములు కవిత్వమునకుఁదగుననియు, నిట్టివితగవనియుఁ దెలియునంతదనుక లఘుకావ్యకవిత్వ మిట్లుగ్రుడ్డిగఁ బయలువెడలవసినదే. విషయముసామాన్యముగనే యుండవలెనని నియమము లేదు. సామాన్యముగ మనముప్రతిదినమందును చూచుచున్నదే గావచ్చును. ఆవిషయమును చూచినంతనె ప్రతివానికిని కవితాధార రానవసరము లేదు. అట్లయినఁ బ్రతివాఁడును కవియగువాఁడే! ఒక యుదాహరణమిచ్చెద. గులాబిపుష్పమునే తీసికొందము. ఇది పుష్పమని ప్రతివానికిఁ దెలియును. అయినను కొన్నివిషయములుమాత్ర మందఱకు స్ఫురణకురానేరవు. దీనిరంగు నేత్రానందకరము, పత్రములు రమణీయతాకారములు, వాసనయా మధ్యస్థమయి హృదయంగమముగనున్నది, దీని

ముకుళవికాసభావములు జన్మచంచలత్వమును చాటుచున్నవి, భగవత్సృష్టి యెంతచిత్రమైనది, మొదలగునంశములన్నియుఁ గవియైనవాని కాపుష్పముఁ జూచినంతనె స్ఫురించును. కాని వీనిలోనొక్కయంశమైనఁ దెలియకుండ నెందఱుస్త్రీలు దానిఁ దలఁ ముడుచుట లేదు? ఎందఱుపురుషులు కంచుకవివరములఁ బ్రదర్శించుకొనుట లేదు? కావున విషయము మనముప్రతిదిన మును చూచునదయైనను ప్రమాదము లేదు. లేకపోవుటయే కాదు. అట్టిసామాన్యవిషయమును తనభావనాశక్తిచే నసామాన్యముగ చూపగలుగుశక్తి కవియైనవానికి ముఖ్యముగనుండ వలయును. కవిత్వవిషయమును కనుఁగొనినంతనె చిత్తవృత్తిని బట్టి కవియైనవాని కావేశముపుట్టును. దానినడఁచుకొనలేక వెలువరచును. లఘుకావ్యముల, అందుపత్రికాముఖమునఁ బ్రచురింపఁబడువానియం దలంకారముల నుపయోగించుటకు వ్యవధి లేదు. ఒకవేళ నాయావేశమలంకారముఖమున వెల్వడ వచ్చును. అలంకారములమాటయటుంచి విషయగ్రహణమం దుమాత్రము విచారముండవలయును. ఇప్పుడు ప్రత్యంశ మును కవిత్వాంశముగనే వాడఁబడుచున్నది. పత్రిక, కలము, కుర్చి, బల్ల, సిరాబుడ్డి మొదలగు నన్నివస్తువులును కవిత్వాంశ ములయినవి. ఇఁక నలంకారములు పూర్తిగనుపయోగింపఁ బడుచునేయున్నవి. సందర్భవివక్ష లేక యుపయోగించినందు చేతనేగదా తెనుఁగుప్రబంధంబులఁ గొన్నిటిమీఁద మన

యాంధ్రసోదరుల కసహ్యతజనించి దానినివాఙ్మయమునకంతకును వర్తింపఁజేయుచున్నారు. కావుననో పత్రికాముఖముల వ్రాయు కవీశ్వరులారా? పవిత్రమగుకవిత్వమునకుఁ గళంకమాపాదింపఁజేయకుఁడు. ఇదివఱకు తెనుఁగుకవిత్వమున నున్నవనివెక్కిరించు కళంకములకే తలలవంచుకొనవలసివచ్చుచున్నదేమొ. నూతనకళంకముల నేలతెచ్చిపెట్టెదరు? విషయగ్రహణంబున మీప్రతిభఁ జూపుఁడు. వ్రాయుటకుఁబూర్వమాలోచించివ్రాయుఁడు. అంశమర్థమా యనర్థమాయని ముమ్మారుబరీక్షచేయుఁడు. పద్యముల వ్రాసితిమని తృప్తినొందకుఁడు. అలంకారములసందర్భంబుల నాలోచింపుఁడు. ప్రతివాఁడుకవియగుటకుఁ బ్రయత్నములోనర్చినఁగాఁజాలఁడు అట్లయినఁబ్రపంచమంతయుఁ గవిమయమైయుండెడిది!

ఆధునికాంధ్రవిమర్శకులు

ఆధునికాంధ్రవిమర్శకులలో నొకపిచ్చియభిప్రాయము కలదు. అర్థాలంకారములెచ్చటనైన నుపయోగింపవచ్చును గాని శబ్దాలంకారములుబొత్తుగ నుపయోగార్హములు కానేకావఁట. చూచిననీయభిప్రాయమునకు చోటులేదు. వారెంతపాశ్చాత్యవిద్యాప్రవీణులయిన నీయభిప్రాయముమాత్ర మావిద్యానుసారమైనదికాదు. ఎవరోయొకరామాటను మొదలనసిరి. అందఱామ్మాట ననుసరించుచున్నారు. ఎందువలననని ప్రశ్నింపవలదా? మాట యాలోచింపకయనినది మాత్రమగును. తమంతటతా

మాలోచింప నేరక "పరప్రత్యయనేయబుద్ధులై" యన్నమాటయే కాని వేరొండు కాదు. అలంకారములావశ్యకములని కాని యనావశ్యకములని కానియనిన శబ్దార్థాలంకారములకు రెంటికిని వర్తించునుగాని ఒకేవిధమైన యలంకారములకుమాత్ర మెన్నటికిని వర్తింప నేరదు. రసస్ఫూర్తి కలంకారములు తోడ్పడుననునపుడు శబ్దార్థాలంకారములు రెండునని కానియొక్కయర్థాలంకారములే తోడ్పడుననునర్థము రానేరదు. శబ్దాలంకారములుమాత్రము రసమునుపుట్టింపవా? వెనుకనిచ్చిన యుదాహరణములవల్లతప్పకనవికూడ రసోత్పత్తికిఁ గారణములగునని చదువరులు తెలిసికొనకపోరు. ఈ చర్చనుచదువుటవలన కావ్యమునకర్థాలంకారము లెంతయావశ్యకములో శబ్దాలంకారములుకూడ నంతయవసరములని చదువరులభిప్రాయపడకపోరు. వాస్తవమాలోచించిన రెండుతరగతులు నొకే విధముగయావశ్యకములు. శబ్దాలంకారములఁదిట్టుట నాగరకతకొకలక్షణము గాఁబోలు! పాపమవియొనర్చిన దుష్కృత మేమి? అలంకారపదమున నవికూడ చేరియుండలేదా? అవి కూడ సందర్భోచితంబులుగ రసమునకుస్థానములు కాలేదా? అట్టియభిప్రాయము కేవలముప్రమాదజనితము. సందర్భోచితములు కాకపోయిన యనుప్రశ్నమున కవకాశము లేదు. అట్టి పిచ్చియభిప్రాయమును గలిగియుండుట కాంగ్లకవిత్వపఠనమే కారణమైనఁ దత్పఠనము సన్మార్గములఁబ్రవర్తింప లేదని చెప్పవలసినదే.

ఎందఱాంగ్లకవులు శబ్దాలంకారముల నుపయోగించియుండ లేదు ! తుట్టతుద కాంగ్లములో విమర్శనమునకుతండ్రియు, ప్రకృతికవులలోఁ గ్రగణ్యులలో నొకఁడు నైన, కోలెరిడ్జికూడ సందర్భంబులనుబట్టి శబ్దాలంకారములు నుపయోగించియేయున్నాఁడు. ఒక్కకోలెరిడ్జియేకాదు. షేక్స్పియరు మిల్టను మొదలగు గొప్పగొప్పకవులుకూడ శ్లేషాద్యలంకారముల ననేకస్థలముల నుపయోగించియున్నారు. వారిలోని శబ్దాలంకారములప్రస్తుతములని విమర్శకులనిరా? వారు వానినప్రస్తుతములని యనకుండుటయేగాక సమర్థించిరి. రసమును పుట్టించునవియనిరి. వైశద్యమును తెచ్చినవియనిరి. కొన్ని యుదాహరణములనిచ్చెద.

ఆంగ్లకవులు, శబ్దాలంకారములు

"I'll live by *Nym* and *Nym* shall live by me"
Shekespeare. King Henry V.

"Have, for the *gilt* of France—O! *guil*t indeed!"
Ibid.

"I am too much in the *sun*"
Shakespeare-Hamlet.

"The *f*urrow *f*ollowed *f*ree"
Coleridge's 'Ancient Mariner'

ఇట్టి యుదాహరణముల వెదుకఁబూనిన లెక్కకు నెక్కుడుగఁ గనఁబడును. కావున పాశ్చాత్యవిమర్శకులుకూడ శబ్దాలంకారములు సందర్భములకుఁబలమును, రమణీయతను, కలు

The italics are mine.

గఁ జేయునను నభిప్రాయఁ మొసఁగిరికాని, యనావశ్యకములని చెప్పియుండలేదు. అనావశ్యకములని చెప్పుట యొక మన విమర్శకుల తలనెపుట్టినది. ఈసందర్భంబున నింకొకమాట చెప్పవలసియున్నది. ఒకవేళ నాంగ్లేయవిమర్శకులుశబ్దాలంకాముల నుపయోగింపఁగూడదని చెప్పినను, మనభాషకానియమము నేలసంక్రమింపఁ జేసికొనవలెను !

ఏభాషా వాఙ్మయమునకు తగినట్లు దానికి విమర్శనా నియమములుగాని కవిత్వనియమములుగాని యుండును. ఒక

భాషాతత్త్వము.

భాషయొక్క నియమములు మఱియొకభాషకు వర్తింపఁ జేయరాదు. సామాన్యనియమములు కొన్నియుండవచ్చును. వానిని ప్రపంచంబుననున్న వాఙ్మయములకన్నిటికిని వర్తింపఁ జేయవచ్చును. ఆనియమములు మానవ తత్త్వము ననుసరించియుండును. ప్రపంచంబునఁ గల జాతులఁ జూచినచో భేదములెన్నికలవో తెలియఁగలదు. ఏజాతికితగినట్టుల నాజాతికి ప్రత్యేకనాగరకత కలదు. వాఙ్మయముగలదు. పరిపాల నాపద్ధతులుగలవు. సంఘీకనియమములుకలవు. ఇట్టివి మఱి యెన్నియోగలవు. అట్లుగాక నన్నిజాతులకు నొకేవిధముగ నెందుల కుండఁగూడదు? ఒకజాతికిని మఱియొక జాతికిని సామీప్యముచే నాగరకత మొదలగునవికూడ మాఱును.ఇట్లు మాఱినవాని నేశాఖయందలివారు వారిశాఖ యందలివానిని సంస్కరింతురు. ఆసంస్క

రించుటకూడ తజ్జాతితత్త్వము ననుసరించియుండును. పైనున్న యంశములలో వాఙ్మయముకూడఁగలదు. భాషాతత్త్వము నను సరించి వాఙ్మయమున్వృద్ధియగు చుండును. కావున నొక భాష యున్నట్టుల మఱియొక భాష యుండనేరదు. ఒకభాషకున్న శక్తు లు మఱియొకదానికి యుండనేరవు. ఒకభాషతో మఱియొక భాషను పోల్పవచ్చును. కాని యొకభాష నాదర్శముగా తీసి కొని మఱియొక భాషను పరీక్షచేయఁగూడదు భాషనుగూర్చి చెప్పిన విషయములన్నియు వాఙ్మయమునకుఁగూడ వర్తించును. కావున నాంగ్లవాఙ్మయవిమర్శనానియమములు తెనుఁగువాఙ్మ యమునకుఁగాని సంస్కృత వాఙ్మయమునకుఁ గాని పూర్తిగ వర్తింపఁజేయుట పొరపాటు? ఎంతవఱకు వర్తింపఁజేయ వచ్చునో చర్చనీయము? మన యాంధ్రవిమర్శకులలో నెవ రైన నావిషయమును క్రోడీకరించి ప్రచురించిన యాంధ్ర భాషకు మహోపకారముచేసిన వారగుదురు. నియమములన్ని భాషలలోనుఁగలవు. ఆంగ్లభాషయందుఁగూడ వాక్యమన్న నెట్లుం డవలసినదియు, ఏపదము లేసందర్భంబుల నుపయోగింప వల సినదియు, ఏయలంకార మెట్టిదనియు, మొదలగునంశములఁ జర్చించు పెద్దశాస్త్రముగలదు. దానిని Rhetoric అందురు. అట్టిశాస్త్రమునే మనమలంకారశాస్త్రమని పిలుచుచున్నా ము. కొన్నివిధములగు కవిత్వములకు సరసముగనిముడుశక్తి యాంగ్లభాషకుఁ గలదు. ఆవిధములగు కవిత్వముల కిముడు

శక్తి తెనుఁగుభాషకు లేదు. అట్లు లేదని తెనుఁగుభాషను తిట్టినఁ బ్రయోజనమేమి? తెనుఁగుభాష చాలమట్టుకు సంస్కృత ప్రాకృతజనితముగాన వానికెట్టిశక్తులున్నవో దీనికిఁగూడ నవిసంక్రమించినవి. మనభాషకున్న శక్తులు కొన్ని యాంగ్ల భాషకు లేవు. కావున నొకభాషయందలి కవిత్వమును మఱి యొకభాషయందలి కవిత్వముతోఁ బోల్చిచర్చించి భాషను తిట్టుట బుద్ధిమంతునిలక్షణము కాదు. ఒకనికి కోటిరూపాయలు సంపాదించుశక్తి యుండును. మఱియొకనికి నూనెనుబియ్య ముతో వండిన యన్నముఁ దిని జీర్ణింపఁ జేసుకొను శక్తియుం డును. ఈశక్తుల రెంటినిఁ బోల్చనెవ్వరుందురు. వానిని వీఁడు తిట్టఁబనిలేదు. వీనిని వాఁడు తిట్టనంతకుముందె లేదు. ఆధుని కాంధ్ర విమర్శకులొనర్చు పొరపాటులలో నిట్లు పోల్చుట యొకటి.

భాషాభిమానము.

సామాన్యముగ జ్ఞానవృద్ధిననుసరించి స్వభాషాభిమానము వర్ధిల్లును. అదేమిపాపమొ యాంధ్రభారతిదురదృష్టవశమున మనయాంధ్రవిమర్శకుల కాంగ్లభాషావిమర్శనాపాండిత్యముచే స్వభాషపై నొకవిధమైన యసహ్యతగలుగుచున్నదని చెప్పవచ్చును. అదిమంచి లక్షణముకాదు. స్వభాషాసేవ స్వదేశభక్తికి ముఖ్యాంగము. బాషను నిరసించువాఁడు దేశబహిష్కారమునకర్హుఁడు. ఒక మహాశయుఁడిట్లు చెప్పియున్నాఁడు.

"The care of the national language, is at all times a sacred trust and the most important privilege of the members of a society. Every man of education should make it the object of his nnceasing concern to preserve his language pure and simple, *to speak it so far as in his power in all its beauty and perfection.* A nation whose language becomes rude and barbarous, must be on the brink of barbarisn in regard to every-thing else. A nation which allows her language to go to ruin is parting with the best half of her intellectual independence and testifies her willingness to cease to exist."

ఒకవేళ భాషలోఁగాని తద్వాఙ్మయములోఁగాని దోషములేవేని యున్నవనికనిపెట్టనచో వానిసవరించుకొనుటకుఁ బ్రయత్నింపవలయునుగాని భాషనునిరసించుట మహాపాతకమని నొక్కిచెప్పవచ్చును. అట్లు నిరసించువాని మొగముఁ జూడరాదు. ఇప్పుడు కాలేజీలలోఁజదువు విద్యార్థులలోఁ జాలమందికి తెనుఁగుచదువుటకుఁగూడ చేతఁగాదని నాయనుభవమునుబట్టి చెప్పఁగలను. పాలకులును, విశ్వవిద్యాలయమువారునుగూడ దేశభాషల ననాదరణ మొనర్చుట లేదుగాని యాదరించుట లేదు. ఇదియిట్లుండ మనకుబుద్ధిని చెప్ప మన పెద్దలకుఁగూడ భాషాభిమానము లేకపోయిన చెప్పవలసినదే మున్నది? మఱియు ,,తాతస్యకూపోయమితిబ్రువంతో క్షారం జలంకాపురుషాఃపిబంతి '' యని యార్యులు చెప్పినటులను,

---

The italics are mine.

మ॥ నిజదేశంబుల వేషభాషలపయి న్నిత్యాభిమానస్థులై [ లే
ప్రజమెచ్చఁగ రసలుబ్ధబుద్ధులగుచుం బ్రాజ్ఞుల్ స్వదేశ్యంబు
నిజమంచుంగొని యన్యదేశములవాని న్మెచ్చ రెప్పట్టునన్
గిజరాజావని ప్రస్ఫుటార్థ రసముల్గావం దు నెల్లప్పుడున్॥

అని, యొక యాంధ్రకవిచెప్పినటులను, తప్పలైననొప్పులై నను మనపూర్వులత్రోవలనేత్రొక్కదమని నూతనప్రయత్నములకును, నూతనాదర్శములకును, చోటియ్యకుండుటయు నింద్యము. గుణము లెచ్చటనున్న నేమి? తద్గ్రహణమునకై భాషాకుమారులందఱుఁ గడఁగవలయు. పూర్వులదూషించకుండ వారుపెట్టినగోడలపై వాఙ్మయభవనమునునిర్మించి భాషాభిమానముతో పాటుగ భాషాభివృద్ధియుఁ జేయుచు నుచ్ఛస్థితిలోనికిఁ బోవుట యొకజాతియొక్క కర్తవ్యము. భాషను సర్వతోముఖముగనొనర్చినఁ గాని దానినుండి వలసినయుపకారంబులఁ బడయఁజాలము.

శ్లో॥ యువతేరివరూప మంగ కావ్యం
స్వదతే స్వచ్ఛగుణం తదప్యతీవ
విహితప్రణయం నిరంతరాభిః
సదలంకారవికల్పకల్పనాభిః॥

"Next to metre the condition absolutely demanded by poetry is figurative and picturusque diction." Professor Hegel.

# విక్రమార్క చరిత్రము.

## జక్కన మహాకవి.

విక్రమార్కచరిత్రము తెనుఁగునఁగల యుత్తమగ్రంథములలో నొకటి. దానిరచియించినది జక్కనమహాకవి. ఈయన,

క॥ చక్కని నీపై దుష్యము
జక్కన నీ కావ్యరచనచాతుర్యంబుల్
జక్కన నీవాగ్వైఖరి
చక్కన నీయాశుమహిమ జక్కనసుకవీ ॥

యనుప్రఖ్యాతిఁ గాంచినవాఁడు. ఈయన పదునేనవశతాబ్దపూర్వార్థంబున నలరినవాఁడు. ఇచ్చట యాయనయొక్క కాలమును నిర్ణయించుటయు, నాయన తలిదండ్రులఁ బేర్కొనుటయు ననవసరము. ఈయనతో నించుమించుగ సమకాలికులగుకవులఁ గొందఱఁ బేర్కొనవలయు. శ్రీనాథుని మనవాఙ్మయధురంధరులలో నొకఁడుగ మనవారందఱుఁ జెప్పియున్నారు. శ్రీనాథుని తరువాతికవులందఱు నాయనను తప్పకతమగ్రంథములయందు కీర్తించియున్నారు. పోతనవిషయమై మిక్కిలిచెప్పన నావశ్యకము. నిష్కలంకమైన కవితాశక్తియం దాయనను బోలినకవి యాంధ్రవాఙ్మయంబునఁ గానరాఁడు. అప్పకవి

యనవసరమగు నియమము నొకదానిఁ దెచ్చి పోతనను లాక్షణికులలోఁ జేర్పకపోయినందువలన నాయనకీర్తిప్రతిష్ఠలు రావంతమైనఁ దగ్గలేదు. ఆయనయున్నస్థానమునకు కొంచెమైనఁ దగ్గరకువచ్చు నాంధ్రకవి లేఁడు. మఱియొకగొప్పకవి నీసందర్భంబునఁ జేర్పవలసియున్నది. పిల్లలమఱ్ఱిపినవీరన తిక్కనంతోఁ దులతూఁగ నెంచి మరల భారతము నొకదానిని వ్రాయ మొదలిడెను. అయినను భగవంతుఁ డాయుర్భాగ్యంబు నియ్యలేదు. ఈయన యల్లసానిపెద్దనామాత్యునిగురువులలో నొకఁడు. ఇంకన నంతామాత్యుఁడు భోజరాజీయమును మృదుమధురపదగుంఫితముఁ జేసి రచించెను. ఈయనకూడ తీసివేయవలసినవాఁడు కాఁడు వీరినందఱి నించుమించుగ నొకమండలిలోఁ జేర్పవచ్చును. శ్రీనాథుని నాంధ్రులందఱు బాగుగ గుర్తెఱుఁగుదురు. కావున నీమండలిని శ్రీనాథమండలియందము. ఈమండలి వఱలినకాల మాంధ్రవాఙ్మయముయొక్క యుచ్చకాలములలో నొకటి. ఈ మండలియందలికవులందఱు ప్రతిభాశాలురు. ఈకాలములో నాంధ్రవాఙ్మయ మొకమార్పును పొందినది.

అప్పటికి పూర్వపువాఙ్మయావస్థను కొంచెముగ చెప్పవలయును. ఈకాలమునకుఁ బూర్వమున్నకవులలోఁ జాలమంది భాషాంతరీకర్తలు. నన్నయభట్టు మొదలుకొని యొక ఱ్ఱిగ్గఱనివఱలి యందఱుపురాణాంధ్రీకర్తలె. మంచనసోమనలు మాత్రము పూర్తిగనాంధ్రీకర్తలుకారు. వారివద్దనే ప్రబంధ

మునకుఁ బునాది వేయఁబడినది. వారు కేవలభాషాంతరీకరణ ములనువదలి ప్రఖ్యాతములగు వస్తువులు గ్రహించి స్వకపోలకల్పనలనందమిచ్చి తమప్రతిభను వెల్లడిపఱచిరి. సోమన యుత్తరహరివంశమును చూచిన మనము తెలిసికొనఁగలము. కథలు సంస్కృతకథల యనుకరణములై, దానసందియంబు లేదు. వానిని చెప్పుటయం దాయనస్వతంత్రశక్తి తెలియఁగలదు. మంచన కేయూరబాహుచరిత్రమును చూచిన నీవిషయమే తేలును. సంస్కృతమహాకవి రాజశేఖరుఁడు వ్రాసిన విద్ధసాలభంజికయందలికథను గైకొని వలసినచోటులనుమార్చి నూతనకల్పనలఁ జొన్పి క్రొత్తదానినొకదానిని రచియించియున్నాఁడు. ప్రబంధకవిత్వమునకుఁ బునాదివేసిన దెవ్వఁడను వాద మొకటి గలదు. "ప్రబంధపరమేశ్వరుఁడ"ను బిరుద మెఱ్ఱాప్రెగ్గడకున్నను బునాది వేసినది కేవలమాయన కాదని కొందఱకు చెప్పవచ్చును. ఏలన కవిత్వమును చూచిన నట్లగపడును. ప్రబంధమునందలికవిత్వమునకు శబ్దార్థచిత్రములు రెండును నవసరములగుచోట్లఁ గావలసియుండును. దీనిఁబట్టి చూడ రెండుచిత్రములతోఁగలసిన స్వభావకవిత్వము నాచనసోమనమంచనలయందెక్కుడున్నదిగాని యెఱ్ఱాప్రెగడయం దంతవిశేషముగ లేదని చెప్పవచ్చును. 'ప్రబంధ పరమేశ్వరుఁ'డను బిరుదము మఱియొక కారణముచే రావచ్చును. ప్రతిభమాత్ర మెఱ్ఱనకంటె సోమనకే యధికమని చదువరులకుఁ దోపకమానదు. తప్పక ప్రబంధధోరణికి సోమనకవిత్వమే దగ్గఱకువచ్చును.

ఈమండలిఁగూర్చి కొంచెముగ ముచ్చటింతము. ఈ కాలమునకుపూర్వమే భాషాంతరీకరణపద్ధతి మాఱినది. స్వకపోలకల్పనలు కవిత్వములో నెక్కువయైనవి. ఈమండలియందలికవులలో శ్రీనాథుఁడునుపోతనయు నింకనుభాషాంతరీకరణమును పూర్తిగవదలలేదు. శ్రీనాథుఁడురచియించిన గ్రంథములలో పల్నాటివీరచరిత్రముతప్ప నించుమించుగనన్నియు నాంధ్రీకరణములే! పోతనభాగవతము భారతాంధ్రీకరణము వంటిది. తిక్కనముఖ్యాదులు సోమనమార్గము ననుసరించిరి. కథలఁజాలమట్టుకు సంస్కృతమునుండిగ్రహించి వలసినచోట్ల మార్చి వానిలోస్వకపోలకల్పనలఁజేర్చి వర్ణనలఁబెంచి తమగ్రంథములరచియించియున్నారు. ఈమార్గాభివృద్ధియై రాను రాను ప్రబంధముగ పరిణమించినది పదునాఱవశతాబ్దము అనఁగఁగృష్ణరాయలకాలము వచ్చునప్పటికిప్రబంధము సమగ్రముగ వృద్ధినొందినది. సోమనమించననాతనివాని నీమార్గము నవలంబించినవారిలో జక్కనయొకఁడు.

అల్లసానిపెద్దనార్యుఁడు మనుచరిత్రమును వ్రాయునపుడు శ్రీనాథుని శృంగారనైషధమును, పినవీరన శృంగారశాకుంతలమును, నాదర్శములుగనుంచికొని వ్రాసెనని మనయాంధ్రవిమర్శకులందఱ అభిప్రాయపడి యుదాహరణములుగ మాదిరిపద్యములననువదించియున్నారు. అదినిజమేకాని వానినేకాదు. విక్రమార్కచరిత్రమునుకూడ 'నాదర్శముగ

నుంచుకొనెను. ఇందుకూడ పెద్దనపద్యములకు మాతృకలు కనబడును. జక్కనవ్రాలినకాలము మంచిది. కృష్ణరాయలిం కపుట్టను. ఆంధ్రము చేదురుష్కులు చాలపర్యాయములోడింపబడిరి. దేశముసంక్షోభముగా లేదు. కవులనాదరించు రాజులుండిరి. రాజులేకాదు. రాజులవద్దనున్నమంత్రులుకూడ తమపేర్లాచంద్రతారార్కము నిలుపుకొనవలయునని నాశవాలకవైరి. అందుచే కవులం వారిగ్రంథములందముకు కృతులుగనియ్యమని బ్రతిమాలుచువచ్చిరి. అల్లసాని పెద్దనార్యుడుచెప్పినటులె కవిత్వమనగ నటులుండవలెనో యీజక్కనకూడ చెప్పియున్నాడు ఈక్రిందపద్యమును చూడుడు.

మ॥ నవశబ్దార్థరసానుబంధ పదవిన్యాసక్రియాభావ గౌ
రవపాకధ్వనిరీతిశయ్యల గవీంద్రశ్రేణి గావ్యాళి జె
ప్పస్వధామత్సరమూని దుష్కవులు చెప్పంజూతురల్లేగదా
శివుడుం దాండవమాడ నాడవె పిశాచీభూతభేతాళముల్॥

ఈయన తనకవిత్వము నీపద్యంబునచెప్పినటుల వ్రాసెను. ఈయనపుస్తకము మఱియొకవిధముగ ప్రయోజనకారి. పెద్దన ప్రబంధరచనామార్గదర్శి యనువాదమున కెదురువాదమాడుటకీవిక్రమార్కచరిత్రమం దొకయాధారముకలదు. ఇందు పీఠికయం దొకపద్యంబున నీయనతాతను పొగడుచుచెప్పిన యీక్రిందివాక్యమునుచూడుడు. ఈయనతాత "యాంధ్ర కవిత్వంబునందుం బ్రబంధంబు మేలుగాదజ్ఞులుమెచ్చ"

జెప్పువాఁడఁట. ఈవాక్యముచేఁ జక్కనతాతకాలమునాఁటికే ప్రబంధంబనునది ప్రచారములోనున్నట్లు మన మూహింపఁ గలము. అయిననా ప్రబంధము పెద్దనప్రబంధమువలె నుండక పోవచ్చును. కావున మనుచరిత్రమువంటిప్రబంధములకు పెద్దన మార్గదర్శియన్నఁ బాగుండునేమొ! అదికూడసరి కాదు. ఏలన నప్పుడు శృంగారశాకుంతలము మొదలగునవి దృష్టిపథంబు నుండితొలఁగిపోవును. మనుచరిత్రము ౦గ ప్రబంధపరిణామ మని యనవచ్చును. దానితరువాత సంతతికంటె మంచి ప్రబంధములు వెల్వడినవి. వానినేమని పిలువవలయునో తెలియ రాకున్నది.

ఇఁక విక్రమార్కచరిత్రఁగూర్చి ముచ్చటింతము. అందలి కథానాయకుఁ డితరనాయకులవలె పౌరాణికుఁడుకాఁడు. చారిత్రకుఁడు. అట్లనుట కాయననామముతో నున్న శకమే తార్కాణము. విక్రమార్కచరిత్ర మనునది మనము సామాన్యముగ చరిత్రమని వాడుకొనుదానివంటిదికాదు. మనయర్థముచరిత్ర మన్న నిజమైనదని. కాని విక్రమార్కచరిత్రమందలికథలు నిజములగుటకువీలు లేదు. ఆకథలఁజదివిన నాయకుఁడుచారిత్రకుఁ డాయను సందియంబు జనించును. కాని సందర్భంబులఁబట్టి కథాంశములనమ్మక వలనుపడదు. కథనుచదువుచున్నంత కాలము నిజములనియె తోఁచుచుండును. పూర్తిగఁజదివినవెనుక నిజములగునాయని ప్రశ్నించిన ననుమానముపొడముును. కవి

యొక్క ప్రతిభ యచ్చటనే యున్నది. ఈకథలలోకూడ నచ్చటచ్చట చరిత్రాంశము లిమిడియున్నవి. వానిలో విక్రమార్కుఁడు శకమహీపాలు నోడించుట యొకటి. ఈపుస్తకమందు విక్రమార్క శాలివాహనులిద్దఱు సమకాలికులని చెప్పఁబడియున్నది. ఇందలికథలత్యద్భుతములు. మఱియొకవిధమైనవిక్రమార్కచరిత్రమొకటికలదు అందుముప్పదిరెండుకథలున్నవి. ఆవిక్రమార్కచరిత్రమునుగూర్చియొక గాథకలదు. విక్రమార్కునికింద్రునివలననొకసింహాసనములభించినదనువిషయంబు రెండు విక్రమార్కచరిత్రములయందును చెప్పఁబడియున్నది. అయిననీవ్యాసాంశమైన విక్రమార్కచరిత్రమందలి కథలు విక్రమార్కుఁడుప్రత్యక్షముగనుండిచేసినచర్యలు. రెండవదానియందలివియట్టివి కావు. పైఁ జెప్పఁబడినసింహాసన మాయనతరువాతఁ బాతిపెట్టఁబడి యొకహాలికునిపొలమందుండుటచే నాపొలమమితముగ ఫలించుచుండెడిదఁట. ఆయనతరువాత కొన్నిసంవత్సరములకు రాజ్యమునకువచ్చినభోజుఁడు పొలమట్లుపండుటకుఁ గారణము కనుఁగొనఁగోరిపొలమంతయుఁ ద్రవ్వింప నాసింహాసనము బయల్పడెనఁట. దానిఁ దెప్పించి శుభ్రపఱిచి దానినధిష్ఠింపఁబోయెనఁట ఆసింహాసనమునకు ముప్పదిరెండు మెట్లుండెనఁట. ఒక్కొక్కమెట్టుమీఁద నొకబొమ్మయుండెనఁట. భోజుఁడెక్కఁబోవ నొక్కొక్కబొమ్మ విక్రమార్కపరాక్రమముఁ దెల్పుచు నొక్కొక్కకథఁ జెప్పి యంతపరాక్రమము నీవద్దనున్న

నధిష్ఠింపుమని భోజుని హెచ్చరించెనఁట. అటుపైఁదానినా యన పూజార్హముగనెంచి పూజించుచుండెనఁట. ఈవిధమైన విక్రమార్కచరిత్రమునకే, "ద్వాత్రింశత్సాలభంజికలకథలు" ను నపరనామముకలదు. ఒకవేళ కథాంశములలో నెక్కడనైన నపోలికలుండునేమోకాని యీ వ్యాసాంశమైన విక్రమార్క చరిత్ర మందలికథ లట్టివి కావు. ఇందు ముప్పదిరెండు లేవు.

ఈజక్కన సంస్కృతాంధ్రములయం దసమాన పాండిత్యముకలవాఁడు. ఈయనకవిత్వము నిర్దుష్టము. ఒకచోట ప్రౌఢము. ఒకచోట లలితము. విక్రమార్కచరిత్రమునందు సంస్కృతాంధ్రములు రెండును సమభాగముల నుపయోగింపఁ బడినవి. ఏదియెక్కడ నుపయోగించిన రసపోషణమగునో దానినక్కడ నుపయోగించెను. వ్యుత్పత్తిగర్వముగ నుప యోగించినవాఁడు కాఁడు. సందర్భంబుఁగనిపెట్టి శబ్దతత్త్వ మునెఱిఁగి యెచ్చటనేవిధమయినపదాళి నుపయోగింపవల యునో పరీక్షించి యుపయోగించెను. అలంకారములఁ గూడ నెక్కడ చూచిననక్కడ వెదఁజల్లిన బాగుండదని సందర్భోచి తములుగ నుపయోగించెను. స్వభావోక్త్యలంకారము నుప యోగించుటలో నీయనకుశక్తిమెండుగఁగలదు. అల్లసాని పెద్ద నగారి స్వభావోక్తులు చాలమట్టుకీయనవాని యనుకరణముల వలెగన్పట్టును. కథలఁజెప్పుటలో నీయనకున్నశక్తి చాలమంది

తెనుఁగుకవులకు లేదు. మధ్యనెచ్చటనైన నాపుటకు బద్ధిపుట్టదు. సామాన్యముగ నాశ్వాసమునకొక కథ చొప్పున చెప్పెను. ఒక్కొకచో నొక్కకథయే యొకటికంటె నెక్కుడాశ్వాసములఁ జెప్పబడినది. శృంగారరసము పుస్తకము నిండ పుక్కిలింతలుగ నున్నది. అక్కడక్కడ కొంచెముగ వెగటగునేమొ? రసములలోనెల్ల శృంగారము ముట్ట మొదటిది. మిగిలినరసములన్నియు శృంగారమునందుద్భవించినవని కొందఱు లాక్షణికుల యభిప్రాయము. శృంగారరసంబు సర్వజనానంద కరంబు. అయిననదికూడ మిక్కుటమయిన యరుచిఁగల్గించును. 'కవుపునిండినఁ గారెలు చేద' నుసామెత యందఱెఱిఁగినదే. సందర్భశుద్ధియందును, జాతినిర్వాహణమందును నీయన యెంతయు సమర్థుఁడు. లోకోక్తులను రంజకములుగ పద్యంబులఁజొప్పి రసమునొలికించుటలో నీయనకుశక్తిచాలఁగలదు. సీసపద్యముల పోకడ యతిరమణీయములు. అనుప్రాసాదిశబ్దాలంకారముల నతిహృదయంగమములుగను సందర్భోచితములుగ నుపయోగించెను. పోతనజక్కనలిద్దఱు సమకాలికులగుటచే నెనఱెఁజూచి యొకఱొకలుపయోగింప మొదలిడిరో చెప్పఁజాలము. వీరిని చూచి పులినిజూచి నక్కవాతఁబెట్టుకొన్నట్టుల తర్వాతికవులలోచాలమంది వానినుపయోగింపవలెనని యుపయోగించి యాభాసరసమును పోషించిరి. ఈయన ప్రకృతివర్ణనములు యథార్థములు. ఈ క్రిందిపద్యమును చూడుఁడు.

ఉ॥ తూనిఁగెలాడెఁదో యనిధిఁదోఁపఁ బ్రమోఁతజనించెఁబం క్తు
కానఁబడెన్ బలాకములు కప్పయొలుంగు సెలంగె నిర్జలలై
స్థానములందుఁ గుంజముతుదన్ గృకలాసము నిల్చి నింగికై
యాసనమెత్తి భూమిరజమంగములం బెరయించెఁ బిచ్చుకల్.

ఈయనకవిత్వమునందు పొల్లుపదములు విశేషముగనుండవు. ఈయన యీగ్రంధమును పెద్దన మనుచరిత్రమునురచియించినంత ప్రయత్నముతో రచియించియుండ లేదు. పెద్దనధారకంటె నీయనధారయనర్గళము. పుస్తకమంతయు నొకకథ కాదు. అందుచే భాషగుంభనమునకుఁ దావుస్వల్పము. అయినను భాషమునతిరమణీయముగ పోషించి యున్నాఁడు. అందుచే కథలనతిమనోజ్ఞములుగ నొనర్చియున్నాఁడు. ఆయనధారాళధారను కల్పనాచాతుర్యమును తెల్పుటకై రెండు పద్యములనుదహరించుచున్నాను.—

చ॥ లలితవలీతరంగరుచులం దరళేక్షణమీనలోచనాం
చల వదనాంబుజద్యుతి లసత్కుచచక్రవిలాసరేఖ నే
ర్పలరెడునీతనూసరసియందు నిరంతరముం విహారముల్
సలిపెడు రాజహంసునకు సైచునెతక్కినపద్మినీరతుల్॥

మ॥ భువనాధీశ్వరుదర్శనోత్సవసుఖంబుం బొందియానందతాం
డవముం జూపెడుభంగి నాకమలషండంబొప్పె భృంగాంగనా
రనగానంబులతో సరోజదళనేత్రశ్రీవిలాసంబుతో,
నవచిత్రాభనయోర్మిహస్తఘటనానావిలాసంబుతోఁ॥

ఇందు మొదలిపద్యమందలి శ్లేష యెంతయు రమణీయంబుగనున్నది. శృంగారమీపద్యమునఁ గడుంగడురమ్యముగ వర్ణింపఁబడినది. చాలచోట్ల నింతకంటె పచ్చిగఁగూడ వ్రాసియున్నాఁడు గాని ముదరకుండ వ్రాసినచో హృదయంగమముగ వ్రాయఁగలశక్తి యీయన కున్నది. ఈయనస్వభావపరిజ్ఞానమున కిదిసఱకె యుదాహరణము నిచ్చియున్నాను. పెద్దన యొక్కడనో "ఏవిహంగముఁగన్న" యనుపద్యమును వ్రాసినాఁడని యీయనస్వభావ పరిజ్ఞానము నమితముగ పొగడుచున్నారు. అది తప్పుగాదు. అయిన నట్టి పద్యంబులు విక్రమార్కచరిత్రమం దనేకములు కనపడుచున్నవి. ఒక్కదాని నుదహరించెద.

సీ॥ అంతంతనగపడినట్లు చేరఁగనిచ్చు,
బైకొనఁజూచినఁబసువు వెట్టు
బటుపరిశ్రాంతి సోఁబడినలాగునటించు,
కైదువునేయడగ్గరిన సురుఁగు,
బొదలమాటుననుండి యదలించుచునుఱొప్పి,
కదియంగఁజూచినఁ బెదరితొలఁగు,
నవనీతలము మోర నలవోకఁగోరాడు,
ద్రోవఁగట్టినఁదప్పుఁద్రోవనుఱుకు,
తే॥ జేరిదవ్వుగఁబాఱును జెరనీక
యల్లనల్లనడపాడి నాసఁగొలుపు.

మనుజపతి నిట్టులాలోచించుకొనుచు నరిగి
యమ్మహాకాళ భవనగహ్వరముఁ జొచ్చె॥

ఈ పద్య మాపందియొనర్చిన కృత్యములన్నియు నా సమయమునకుఁ దగి యెంతస్వభావమనోహరములుగ నున్నవియో వేనోళ్లఁ జాటుచున్నది. ఇట్టి స్వభావపరిజ్ఞానము గలిగిన పద్యములు వెదుకఁ బూనినచో లెక్కకు మిక్కిలిగ గనపడును. ఈయన భావప్రకాశనము నెంతరమణీయముగ వర్ణింపఁగలఁడో యీక్రింది పద్యంబులఁ జూడఁదగు.

ఉ॥ చెప్పఁదలంచు సిగ్గుతనుఁ జెప్పఁగనీమికిసంచలించుఁ దాఁ
జెప్పెడుమాట యెవ్వరికిఁ జెప్పకుమీయనఁ జూచు నంతటం
జెప్పకయుండరాదు మఱిచెప్పఁగరాదనిగొంకు నెమ్మొయిం
జెప్పకపోనుపొమ్మనుచుఁ జిత్తమునూలొకనఁ జేసియిట్లనుఁ

తరువాత నామె తనహృదయంబునఁ గలయాస నెంత వ్యంగ్యప్రధానముగఁ జెప్పెనో చూడుఁడు.

తే॥ నిజకరస్పర్శ మొనరించు నీరజములు
నర్కుఁడలరించునది యెంతయున్న కిరణి
వినియయంతన విక్రమవినుతుఁడైన
యర్కుఁడలరించె నాహృదయాంబుజంబు॥

ఈపద్యము చదివినవారి హృదయాంబుజముల నలరించుచునే యున్నది. ఈయనకళాకౌశలము కొనియాడఁ దగియున్నది. ఈయన భరతశాస్త్రవేత్త. రంభోర్వశీనర్తనంబులవర్ణించునపు

డీయన కౌశలము గన్పడఁగలదు. ఆపద్యముల ననువదించుట కిచ్చటస్థలముచాలదు. చదివినఁ బూర్తిగఁ దెలియఁగలదు. ఇద్దఱినాట్యంబుల నేదిప్రశస్తతరమనియడిగిన నాపద్యంబులఁ జదివి చెప్పవచ్చును. అలంకారమునుపయోగించుటలో సందర్భశుద్ధి యీయనకుఁ బూర్తిగనున్నదని యిదివరలో చెప్పియుంటి. అద్దానికై యొక్క యుదాహరణమునిచ్చెద.

తే॥ అంతఁ జీకటి బెబ్బులియాసలెల్లఁ
బాసిపోయినకైవడిఁ బాసిపోయె,
విజయపాలుని నెమ్మోము విన్నఁబోయి
తెల్లవాఱినకైవడిఁ దెల్లవాఱె॥

ఇట్లు సందర్భోచితములుగ నలంకారములనుపయోగించిన మనయాంధ్రవిమర్శకులకు కావ్యముల నలంకారము లనావశ్యకములనుటకు నోరు జెల్లునా? యెవఁడో యొక్కఁడు సందర్భశుద్ధి లేక యుపయోగించెను గాన వారట్లందురు. అట్టిచో నాస్థలముల నలంకారము లనావశ్యకములని యనవచ్చుఁగాని మొదలే పెఱికివేయఁగడంగుట న్యాయమా? పాండిత్యప్రకర్షమా? ఈజక్కనకు పఱుగులెత్తువచనముల రచియించుటలో నసమానశక్తికలదు. ఆధునికవచనరచనాకుశలులుకూడ జక్కనవచనముల మెచ్చుకొనకపోరు. ఆయనవచనముల వారుకూడ నేర్చుకొనఁదగినవిశేషములు గలవు. జక్కనకాలమున్నాఁటికింకను వచనంబులందక్కడక్కడ వాక్యమునర్థమునుపూర్తియగుచో

టుల విరామములుంచుట యలవాటుకాలేదు. కానియా యలవాటున్న జక్కనచక్కనివచనములను వ్రాసియుండెడివాఁడని యభిప్రాయపడకపోరు. లోకోక్తులఁ బద్యములఁ జొన్పి రసముప్పతిలునట్లుచేయుటలో యీయనకు శక్తిచాలఁ గలదు. రెండుమూఁడుదాహరణములు నిచ్చెద.

ఉ॥ కాదనివంకలేల త్రేఁదిలకింబులె రాజులచిత్తవృత్తముల్ ॥

ఆ 3. ప 43.

ఉ॥ పులిమీసం నుయ్యేలలూఁగవచ్చునే ॥

ఆ 4. ప 59.

చ॥ బాఁపనపోటునుఁ గప్పకాటునుం గలదెధరిత్రి ॥

ఆ 4. ప 63.

ఇట్టివాసి వెదకఁబూనిన సంఖ్యకుమేర లేదు. నీతులఁ జెప్పుటలో నీయనకుచాలశక్తికలదు. ఆపద్యములఁజదివిన నానీతులమన సనుసరింపవలెననుమనసు పుట్టును. ఒక్కయుదాహరణమిచ్చెద.

క॥ దేవుండు లేమికలిమియు
భావింపఁగరాదు కనకపాషాణములన్।
భావముననునికిసిద్ధము
కావున భావంబుప్రథమకారణ మనఘా ॥

ఇట్లీయన కవిత్వమందలి గుణములఁ బేర్కొని వానికిఁ దార్కాణములఁజూపఁబూనిన నంతుండదు. కావున నందలిచి

త్రములఁ దెలియఁగోరువారు తప్పక నీపుస్తకమును చదివితీరవలెను. ఈవట్టిపాడిమాటలఁ జదివిన లాభ మేమి ?

ఈ మనకవనము ననుసరించినది యొక్కపెద్దనార్యుఁడే కాఁడు. అయ్యలరాజు రామభద్రుఁడు మొదలగు ననేకకవుల కీయనకవిత్వము దీపమై త్రోవఁ గొన్నిటఁ జూపినది. వారేయన నేల ? ఇప్పటిప్రబంధకర్తలును, నాటకకర్తలుకూడ జక్కన ననుసరించుట మానిరా ? మాన లేదు. మానవలసినది కాదు. మంచి ననుకరింపక చెడ్డ ననుకరింపవలెనా ? ఈయనకూడ పూర్వసంస్కృతాంధ్రకవుల ననుసరించినట్లు పుస్తకముఁ జదువుచు మనము తెలిసికొనఁగలము. ‘జయలక్ష్మీ నిత్య సాంగత్యముల్’ ‘అధీతిబోధాచరణప్రచారణ సదర్థముగా’ మొదలగువాక్యములఁ జూచిన నీయనకు పూర్వకవీశ్వరులయం దెంతయాదరముకలదో తెలియఁగలదు. అనుకరణము గౌరవసూచకమని యందఱొప్పుకొందురుకదా ! ఈయన ప్రస్తావనయందు భారతకవులమువ్వురమాత్రమే పేర్కొనియున్నాఁడు. శ్రీనాథపోతనపినవీరనలు సమకాలికులగుటచే వారినామముల నెత్తుకొన లేదనుకొందము. నాచనసోమనఁ గూడఁ బేర్కొని యుండ లేదు. సోమునికవిత్వమునందు జక్కనకుఁ గౌరవము లేదనుటకు వలనుపడదు. సోమునిపోకడల కెనయగుపోకడలు విక్రమార్కచరిత్రమం దనేకములు కానవచ్చుచున్నవి. కొన్నిచోటుల సోమన వ్రాసినపదంబు లే యుపయోగింపఁబడియు

న్నవి. పేర్కొనకుండుటకుఁ గారణమారయుటకష్టము. సోముఁడు నన్నయతిక్కనలఁగూడఁ బేర్కొనినట్టులగపడదు. అందుచే వారియందాయనకాదరము లేదనిచెప్పుట సరియా ? ఆశ్వాసాంతగద్యంబునమాత్రము తిక్కనను బ్రశంసించియున్నాఁడు. ఆయనయందు గౌరవము లేకపోయిన నాయనగ్రంథములోనుండుదానికి తనది యనంతరకథయని యేలపేర్కొనవలయు ?

శ్రీనాథుఁడు, జక్కన, పినవీరన, అనంతామాత్యుఁడు, ఈనల్వురుసమకాలికులని చెప్పియుంటిని. పోతనకూడ సమకాలికుఁడె. అయిననాయన వీరితోఁబోల్పఁబడవలసినవాఁడు కాఁడు. ఈమువ్వురే కాదు. ఆంధ్రకవులలో నెవ్వరు నాయనకుసాటిరారు. శ్రీనాథాదులగు నలుగురిలో నందఱును కొన్నివిషయముల సమానులు. శ్రీనాథుఁడుగొప్పవాఁడనియు నాయననెతరువాతకవులందఱు ననుసరించిరనియుఁ జెప్పుట కాయనపైనుండు పాక్షికబుద్ధియే కారణము. శ్రీనాథునియందుండి మిగిలిన వారియందు లేని విశేషలక్షములెవ్వియుఁ గానరావు. సీసపద్యములయొయ్యారపు నడకలు మొదలగునవి నెలకొల్పుట యొక్కయాయన తలనుపుట్టినదె కాదు. జక్కనవీరనలసీసపద్యములుకూడ నట్లెయుండును. అంతయొయ్యారపునడకలుకల్పిసెను. పెద్దనకు శ్రీనాథునియందు గౌరవముండెనుగాన యాయనననన్నివిషయంబులననుసరించెననియు, తరువాతికవు

లందఱును పెద్దనననుసరించిరి గాన తద్ద్వారా శ్రీనాథుననుసరించిరనియుఁ జెప్పుటనిజముకాదు. పెద్దనయనుసరించినది యొక్క శ్రీనాథునె కాదని మున్నె చెప్పియుంటి. ఎవరివద్ద నేవిశేష గుణములున్నవో వానినన్నిటిఁ గ్రహియించి మనుచరిత్రంబున నిమిడ్చె. శ్రీనాథునికవిత్వమందున్న లక్షణములన్నియు నంద తికవిత్వమందుగూడఁగలవని చెప్పియుంటి. అందఱును నించుమించుగ సమకాలికులుగాన నెవరినెవరనుసరించిరో చెప్పఁజాలము. కాని స్వకపోలకల్పనలు శ్రీనాథునియందుకంటె జక్కనపినవీరనలం దెక్కుడుగకలవు. వ్యక్తిమాత్రము వీరనది శ్రీనాథునిదానికంటె నెన్నియోమడుఁగు లుత్కృష్టమైనది. ప్రతిభయందుమాత్రము శ్రీనాథుఁ డందఱకుఁ దీసిపోవును శ్రీనాథునిగ్రంథములకంటె మిగిలినవారివే (అందుముఖ్యముగ వీరనశృంగారశాకుంతలము) స్వతంత్రములు. వీఱందఱిగ్రంథములలో శృంగారశాకుంతలము మాత్రమే ప్రబంధమునకు మిక్కిలిదగ్గిరికివచ్చును. కావున నా మండలిలోని వారిలో పోతనను వదలి పినవీరన యగ్రస్థాన మొసఁగఁదగినవాఁడు. తరువాత జక్కనాద్యులువత్తురు.

సమాప్తము.